A Complete Fun Magazine
హాస్యానందం

01-04-2020

హాస్యానందం ఆత్మీయులకు

హాస్యాభివందనాలు!

ప్రస్తుత పరిస్థితులలో పత్రికని విడుదల చేయడమా? వద్దా.. అనే సందేహంలో
ఉన్నాం... ఎందుకంటే చేయడానికి ప్రెస్ పని చేయటం లేదు....
ఒకవేళ ఎలాగోలా ప్రింటింగ్ చేస్తే పాఠకుల వద్దకు పంపడానికి ఏ రవాణా
సౌకర్యమూ లేదు... పోస్టల్ శాఖ కూడా పని చేయట్లేదు.
ఈ స్థితిలో చాలామంది పాఠకులు పత్రికని ఆన్‌లైన్లో అయినా విడుదల చేయమని
కోరటం వలన పత్రికని ఆన్‌లైన్లో విడుదల చేయడమైనది.
తరువాత అంటే ఏప్రిల్ 20 వ తేదీ తరువాత పోస్ట్‌చేయడానికి
సన్నాహాలు చేస్తున్నాం! ఆలస్యమయినా పరవాలేదు... పత్రికని ఆపకూడదనే
మా నిర్ణయాన్ని మీరు సహృదయంతో అర్థం చేసుకుంటారని ఆశిస్తూ...

రాము.పి.



#8-215/4, Near Ramalayam, YERRABALEM-522 503, Mangalagiri, Guntur

# హాస్యానందం

సంపూర్ణ హాస్య మాస పత్రిక

ఏప్రిల్ -2020 ₹20/-


స్వచ్ఛమైన
చిరునవ్వుకు
అచ్చమైన
చిరునామా





వేదనాగ ఫౌండేషన్
ఉగాది కథల పోటీలో
బహుమతి పొందిన
కథల ప్రత్యేక సంచిక




తెలుగులో
వెలువడుతున్న
ఏకైక హాస్య
మాస పత్రిక


టీ తాగుతూండండి పిన్నీ.. మావారొచ్చారు
లైట్‌గా కోటింగిచ్చొస్తా !!
105 Pts.




వచ్చే జన్మలో కూడా నేనే భర్తగా కావాలని
ప్రార్థించావా?.. ఏం మూన్నాలుగు జన్మలకు
రెన్యూయల్ చేయించుకోక పోయావా?


ఒక్కసారయినా మీరు అవినీతి నిరోధకశాఖ
వాళ్ళకు దొరికితేనే కదా మీరు లంచం
తీసుకుంటారని పబ్లిక్‌కు తెలిసేది!!


మర్యాదగా ఫిస్టల్ కింద పడేయ్.. లేదా

స్వచ్ఛమైన చిరునవ్వుకి... అచ్చమైన చిరునామా...

# హాస్యానందం

సంపూర్ణ హాస్య మాస పత్రిక

**సంపాదకులు: రాము.పి**

**ఏప్రిల్-2020 ✦ 18వ సంవత్సరం ✦ 190 వ సంచిక**


*Publisher& Editor-* Ramu.P

*Full Pillar-* Bnim

*Well Wishers:*
Tanikella Bharani
Dr.Sudarsan
K.V.V.Satyanarayana
Mallik, Sanku
T.Chandra Sekhar

*D.T.P*
P. Ramalakshmi, 9440304993

*Perpetuals*
A.Dayakar, Ramakrishna,
Lepakshi, Bannu, Krishna
Bachi,Nagisetty, Nagraj, Venkat




**ముఖచిత్రం: రశ్మిక**
**కార్టూన్: జయదేవ్**


సంవత్సర చందా
**రూ.300/-**

**2 సంవత్సరాల చందా**
**రూ.500/-**
**(పోస్టల్ చార్జీలతో)**



Editorial Office: **HASYANANDAM**
# 8-215/4, Near Ramalayam,
**Po:YERRABALEM-522 503,**
Mangalagiri Mandal, Guntur dist.
*Ph* : **9849630637**
email: **hasyanandam.mag@gmail.com**



Hyderabad & Secunderabad Distributors:
**Charminar News Agencies,**
1-6-176/1, M.G.Road,
**Secunderabad**, Ph:8179627830
**Hyderabad.** Ph:8919181332


**ఓ చక్కటి చిరునవ్వే**
**ప్రతి ఇంటా అందమైన ఉషోదయం!**

## హాయ్...హాస్యానందంగా...

**హాస్యానందం అభిమానులకు...**
**ఆప్తులకు... సన్నిహితులకు**
**హాస్యాభివందనాలు**

మనం తరచుగా మనకిష్టంలేని వ్యక్తి గురించి వేరేవాళ్ళతో చెప్తూ ఎక్కువసార్లు వాళ్ళగురించే తలచుకుంటుంటాం... ఆస్తికుని కంటే, దేవుడు లేడని వాదిస్తూ ఎక్కువసార్లు దేవుణ్ణి తలచుకుంటున్నా 'నాస్తికుని'లా!

వాళ్ళ పద్ధతులు నచ్చకనో, అభిప్రాయ భేదాలు వచ్చో కొందరికి దూరమయి పోతాం... అంతే! అక్కడితో వాళ్ళని మన ఆలోచనల్నుంచి తీసేయడమే శ్రేయస్కరం. మనల్ని ప్రేమించేవాళ్ళు, అభిమానించే వాళ్ళు చాలా మంది ఉన్నారు కదా! వాళ్ళతో, మాట్లాడుతూ బంధాల్ని పెంచుకునే ప్రయత్నం చేద్దాం!

మనతో విభేదించిన వాళ్ళగురించి చెడుగా చెప్తే... మన తప్పుని కప్పిపుచ్చుకోవడానికే ఆ సమర్ధింపు అన్న ఆలోచన ఎదుటి వాళ్ళకు కలగక మానదు!...

కాబట్టి 'వద్దు' అనుకునే వాళ్ళని తలచుకోవటం అనవసరమే కదా!

మనం చేయాల్సినవి చాలా ఉన్నాయి. వాటిమీద దృష్టి పెడదాం... అనవసరమయిన వాటిని పట్టించుకోకుండా బ్రతుకుదాం! అందరూ ఆనందంగా... ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటూ...




Ramu.P

మీ సలహాలు, సూచనలు
పత్రిక మనుగడకు సోపానాలు.
మీ అభిప్రాయాలు కింది
మెయిల్‌కు పంపండి
hasyanandam.mag@gmail.com

Smile in every page Satisfaction in every smile

## వేదనాగ ఫౌండేషన్ ఉగాది హాస్యకథల పోటీలో బహుమతి పొందిన కథలు






| | | |
|---|---|---|
| పూర్వాభాద్ర | -పొత్తూరి విజయలక్ష్మి | **-10** |
| ఎటుపోయి ఎటొస్తుందో | -గంగాధర్ వడ్లమన్నాటి | **-16** |
| టిక్ టాక్-టిట్ ఫర్ టాట్ | -జడా సుబ్బారావు | **-20** |
| హనూ ఈజ్ ది బెస్ట్ | -డా॥ఎమ్ సుగుణరావు | **-26** |
| బంపర్ ఆఫర్ | -మణి వడ్లమాని | **-32** |
| సైకాలజిస్ట్ | -ఇంద్రగంటి నరసింహమూర్తి | **-36** |
| పరోపకార్ ప్రజాసేవ | -రాజేష్ యాళ్ళ | **-40** |
| వేట | -ఎన్. అరుణశ్రీ | **-46** |


### శీర్షికలు


| | | |
|---|---|---|
| హాస్యానంద శతకం | -కంచనపల్లి ద్వారకానాథ్ | **-7** |
| తర్కారావు కథలు | -గంగాధర్ వడ్లమన్నాటి | **-25** |
| ఫన్ పంచ్ | -గుండు సుదర్శన్ | **-50** |


## కార్టూన్ శీర్షికలు...


| | |
|---|---|
| కిక్కికిక్కికిక్కికి... | -2 |
| సినీటూన్ | -4 |
| రాజ'కీ'యం | -5 |
| ప్రోత్సాహక బహుమతులు | -5 |
| నవ్వులబడి | -6 |
| డ్రూడిల్స్ | 8 |
| టింకు | -11 |
| ఆఫీస్ టూన్ | -14 |
| మన జనాలు | -17 |
| కింకారావం | -21 |
| ఫ్యూచర్ పంచ్ | -24 |
| రాజాధిరాజరాజమార్తాండ | -27 |
| సైలెంట్ స్టైల్ | -33 |
| ఈతరం కోడలు | -37 |
| లాఫింగ్‌పిల్ | -39 |
| అదన్నమాట | -41 |
| చిత్రహాసం | -45 |
| మిస్టర్ కాక్ | -47 |
| కరోనా కార్టూన్లు | -51 |
| ది బెస్ట్ కార్టూన్ ఆఫ్ ది మంత్ | -52 |


కథలకు బొమ్మలు- చైతన్య.


### ఈ సంచికలో కార్టూనిస్టులు

- బాలి
- సుభాని
- సరసి
- బాచి
- బన్ను
- లేపాక్షి
- గాంధి
- రామశర్మ
- రామ్‌శేష
- నాగిశెట్టి
- నా॥గ్రాజ్
- కృష్ణ
- సాయికృష్ణ
- హరగోపాల్
- కామేష్
- ఆదినారాయణరావు
- చక్రవర్తి
- గిరి
- దొరశ్రీ
- తోపల్లి ఆనంద్
- గుత్తుల శ్రీనివాస్
- వడ్డేపల్లి వెంకటేష్
- ప్రసిద్ధ
- జెన్నా
- టి.ఆర్.బాబు
- నూతి
- నాధ్
- వినోద్
- దాస్
- కందికట్ల
- శ్రీ
- ప్రసాద్ కాజ
- బాలు
- అర్జున్
- ప్రభాకర్
- జాకీర్
- హేమంత్
- ప్రేమ్
- జి.ఎస్.ఆర్.
- శ్రీకర్

## సినీటూన్




BANNU*




**గమనిక:** ఈ పత్రికలో ప్రచురించబడే వ్యంగ్య, హాస్య రచనలు, కార్టూన్లు కేవలం హాస్యం కోసం ప్రచురించినవి మాత్రమే. ఏ వ్యక్తిని గాని, సంస్థని గాని కించపరచాలన్నది మా అభిమతం కాదు. ఈ పత్రికలో ప్రచురించిన రచనలన్నీ ఆయా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలు మాత్రమే.

# రాజ'కీ'యం

-సుభాని















## ది బెస్ట్ కార్టూన్ ఆఫ్ ది మంత్!

### ప్రోత్సాహక బహుమతి: రూ.1000/-




మన కార్టూనిస్టులను ప్రోత్సాహించాలనే సదుద్దేశంతో **కార్టూన్ ఇష్టులు శ్రీ కె.వి.వి.సత్యనారాయణగారు** ప్రతి నెలా హాస్యానందంకు వచ్చిన కార్టూన్‌లలోంచి **ఒక మంచి కార్టూన్‌కి రూ.1000/-లు** బహుమతిగా ఇస్తున్నారు.

ఈ నెల బెస్ట్ కార్టూనిస్ట్- **కృష్ణ**

కార్టూన్ 52 వ పేజీలో




కార్టూనిస్ట్ శ్రీ జె.ఎస్.ఆర్. **(జె. శ్రీరామచంద్రమూర్తి గారు)** వారి తల్లి దండ్రుల జ్ఞాపకార్థం **కార్టూనిస్టులను ప్రోత్సాహించాలని ప్రతినెలా 500 రూపాయలు** హాస్యానందంకు వచ్చిన కార్టూన్లోంచి ఒక మంచి కార్టూన్‌కి ఈ బహుమతి ఇవ్వబడుతుంది.



## రీసౌండ్

✦ **యార్లగడ్డ మంజుల, రాజమండ్రి**

**హా**స్యానందం మొట్టమొదటి సంచిక నుంచి పాఠ కురాల్ని నేను. 18వ వసంతంలోకి అడుగుపెడుతున్న హాస్యానందానికి నా అభినందనలు. ఇంతకు ముందు 'నవ్వులడాక్టర్' అన్న శీర్షికన ఇచ్చిన కార్టూన్ పుస్తకం మళ్ళీ ప్రారంభించినందుకు చాలా సంతోషం. కాకపోతే ప్రతినెలా ఇలా అనుబంధం వచ్చేట్లు చూడండి సార్!

✦ **పంజాల నరసయ్య, హైదరాబాద్**

**ఈ** ఉగాది నాటికి 17 వసంతాలు పూర్తి చేసుకో నున్న మీ, మా, మనందరి హాస్యానందం... హాస్య ప్రియుల పాలిటి కల్పతరువు. నవ్వుతూ బతకాలనే వారికి కొంగు బంగారం. మన హాస్యానందానికి జన్మ దిన శుభాకాంక్షలు! హాస్యానంద కైమోడుపులు! కవర్ పేజీ కార్టూన్ 'పేయిడ్' పంచాంగ ఫలితాల పై వేసిన చురుకు మామూలుగా పేలలేదు సుమా! అట్ట చివరి Best Cartoon of The Month నేటి కొంతమంది ఉద్యోగుల తెలివి తక్కువ తనాన్ని చక్కగా పట్టుకుంది. శార్వరి నామ సంవత్సర గ్రహచార ఫలితాలు సరదాగా వున్నవి. 'పరామర్శ' కథలోని కొంటె భార్య కొంటె తనం గురించి ఏమని మనవి చేద్దునూ? తర్కారావు కథలోని సుబ్బారావు నేనైతే...అనే ప్రశ్నకు గురైన చదువరులలో నేనొక్కడిని. తర్కారావు ను మెప్పించ్చడం ఈ జన్మలో సుబ్బారావుతో అవుతుందా? అనేది పాఠకులను వేధిస్తున్న ప్రశ్న. గంగాధర వడ్లమన్నాటి... హాట్స్ ఆఫ్ టు యు. ఫుల్‌పిల్లర్ బ్నిం గారి కార్టూన్లు ఎంతగానో ఎంజాయి చేసాము.



✦ **జి.రామ్‌ప్రసాద్, హైదరాబాద్**

**మా**ర్చి హాస్యానందం ముఖచిత్రం కార్టూన్ నుంచే నవ్వుల పువ్వులు పూయించింది. గ్రహచార ఫలితాలు సూపర్. పడి పడీ మా ఇంటిల్లిపాది నవ్వు కున్నాం. నేనో హాస్పిటల్‌కెళ్ళీ అక్కడ ఈ సంచిక చూసాను. వస్తూ వస్తూ పత్రిక కొన్నాను. ఇన్నాళ్ళు మిస్ అయినందుకు బాధ పడ్డా, ఇప్పటికైనా తెలిసిం దని సంతోషించాం. అయితే పేజీలు ఇంకొన్ని పెంచితే బావుంటుందేమో... మధ్యపేజీలో అనుబంధం బయ టకు తీసేసాక పుస్తకం బాగా చిక్కిపోయింది. ఏనీహౌ మంచి పుస్తకం చదివాము.

✦ **ఆర్.పుష్పలత, విజయనగరం**

**హా**స్యానందం మార్చి సంచికలో ప్రచురించిన కథలు చాలా బావున్నాయి. మధ్య పేజీలో బ్నింగారి కార్టూన్లు గొప్పగా ఉన్నాయి. చివరి పేజీలో గుండు సుదర్శనం గారి సమాధానాలు సూపర్!

✦ **జి.వి.జయశ్రీ, నెల్లూరు**

**ఎం**తో కష్టపడి, గ్రహాల గమనాలను శోధించి మా గ్రహచారాలు మార్చి హాస్యానందంలో అందించిన 'సత్యనిష్ఠ గ్రహాంతర సిద్ధాంతి' గారికి, తెలుగులో అనువదించిన కండ్లకుంట శరత్‌చంద్రగారికి మా కృతజ్ఞతలు. మార్కెట్లో ఎక్కడా దొరకని ఈ పంచాంగాన్ని భద్రంగా మా బ్యాంక్ లాకర్‌లో దాచి ఉంచాము. ఇందులో రాజపూజ్యం, అవ మానం, ఆదాయం, వ్యయం... విషయాలు చాలా శ్రద్ధగా పాటించాలని నిర్ణయం తీసుకున్నాం!



# హాస్యానంద శతకం



కంచనపల్లి ద్వారకానాథ్,
9985295605



స్పర్శ కంటే మాట గొప్పది
మాటకంటే నవ్వు గొప్పది
నవ్వుతూ మంచిమాటపలికితే ఊరు మనదవుతుంది
**నిక్కముగ నిజము చెప్పు హాస్యానందం!** 59

**త**న నవ్వే తనకు మిత్రుడు
తన నవ్వే తనకు ఆరోగ్యము
తన సంతోషమే తన స్వర్గము
**నిక్కముగ నిజము చెప్పు హాస్యానందం!** 60

పెద్దలతో మాటలాడేటపుడు చిరునవ్వు
పిల్లలతో మాటలాడేటపుడు ప్రేమనవ్వు
ఆలుమగల మాటల్లో సరసమైన నవ్వులోనే విలువరా
**నిక్కముగ నిజము చెప్పు హాస్యానందం!** 61

**జ**నన మరణము సహజము
కాలమన్నది కరిగిపోవుట సహజము
హాస్యము లేని జీవితము వ్యర్థము
**నిక్కముగ నిజము చెప్పు హాస్యానందం!** 62

**ఆ**టగాడి గెలుపులో ఆనందం
రాజుగారి నవ్వులో రాజసం
తల్లి బిడ్డను కన్నప్పుడు సంతోషం మరపు రానిది
**నిక్కముగ నిజము చెప్పు హాస్యానందం!** 63

**స**ర్కస్సులో జోకర్ చేసే పనులు
జనాలకు నవ్వులే నవ్వులు
బఫూన్లు హాస్యాన్ని పండించే ఘనులు
**నిక్కముగ నిజము చెప్పు హాస్యానందం!** 64

**ఊ**యలలో బిడ్డనవ్వులు
అమ్మానాన్నలకు సంతోషాలు
తాతవ్వలకు కాలక్షేపాలు
**నిక్కముగ నిజము చెప్పు హాస్యానందం!** 65

**అవమానాన్ని, క్రోధాన్ని ఎదుర్కోగల ఒకే ఒక ఆయుధం-
చిరునవ్వు!**

**బయట తిరగకండి..
ఇంట్లోనే ఉండండి...
కరోనాతో యుద్ధం చేయండి..
వెంటనే నెట్ ఓపెన్ చేయండి..
క్లిక్ చేయండి....**

**www.gotelugu.com**

గోతెలుగు.కామ్
సాహిత్యఘని

ఎప్పటికప్పుడు..
కొత్తవి...


కథలు..
కార్టూన్లు..
వ్యాసాలు...
సమీక్షలు..

**రచయితలు
తమ రచనలను
స్వయంగా అప్‌లోడ్
చేసుకోవచ్చు ఇప్పుడే...**

అప్లోడ్ చేయండి

రచయితలు, కార్టూనిస్టులు వారి రచన / కార్టూన్లను అప్లోడ్ చేసుకోవచ్చు.

Upload


ఏమిటో సార్! మావారు చైనా నుండి వచ్చేశానన్నారు - ఆహా! అనుకున్నాను - తిరిగి ఫోను - క్వారంటైన్‌లో ఉన్నానని - ఆదేశమెక్కడో మరి
పెద్దవారికి మాత్రమే! అంటే పరిగెత్తుకొని వెళ్ళాను - చివరి రోజుల్లో ఎలా బతకాలో మాత్రమే చూపించాడట ఆ సినిమాలో - ఛీ!!
TO DAY
బాలి
క్రెడిట్స్
వీధిముఖం చూసి రెండు నెలలు అయ్యిందా! కంగారు పడకు - మమ్మల్ని వీధుల్లోకే రావద్దంటున్నారు - ఈ కరోనా వైరస్ వల్ల తెల్సా
నిజమే వదినా! ఈ మిక్సీలకు అలవాటుపోయి పప్పు ఎట్లా రుబ్బాలో నేనూ మర్చిపోయాను -




కార్టూన్‌ని ప్రాణంగా ప్రేమించిన **శ్రీమతి వాగ్దేవి జ్ఞాపకార్థం...**

కార్టూన్ కళని ఆరాధిస్తున్న కార్టూనిస్ట్‌లకు

## వాగ్దేవి పురస్కారం!

**శ్రీ వాగ్దేవి విశ్వేశ్వరరావు గారు**

ప్రతినెలా ఒక కార్టూనిస్ట్‌కి **1000 రూపాయలు**

**మరియు ప్రశంసాపత్రం** అందజేస్తున్నారు.



ఈ నెల పురస్కార గ్రహీత **-శ్రీ**

## సామాజిక చైతన్యంలో కవుల పాత్ర కీలకం

-డాక్టర్ నాళేశ్వరం శంకరం.




**సా**మాజిక చైతన్యంలో కవుల పాత్ర కీలకమని ప్రముఖ కవి, తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నాళేశ్వరం శంకరం అన్నారు.

15,మార్చి,2020న స్థానిక వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో ఉదయ సాహితీ ఆధ్వర్యంలో- డాక్టర్ అడిగొప్పుల సదయ్య రచించిన 'ఇష్టపది-2', నాగమల్ల పున్నం చందర్ రచించిన 'పున్నం మాట' దోమల జనార్ధన్ రచించిన 'ఇష్టపదులు' గ్రంథాల ఆవిష్కరణ సభ జరిగింది.

ప్రక్రియ ఏదైనా అందులో కవిత్వాన్ని పండించినట్లయితే పాఠకులు ఆదరిస్తారని, అది ప్రక్రియగా నిలువ గలుగుతుందని అన్నారు. సమాజ హితం కోరుతూ ముగ్గురు కవులు వెలువరించిన మూడు గ్రంథాలు మంచి సందేశాలను అందించాయని పలువురు వక్తలు పేర్కొన్నారు.

విశిష్ట అతిథులుగా పాల్గొన్నప్రముఖ కవి విమర్శకులు దాస్యం సేనాధిపతి, గౌరవ అతిథులుగా డా.కలువకుంట రామకృష్ణ, నంది శ్రీనివాస్‌లు గ్రంథకర్తలను అభినందిస్తూ- హృదయాలను కదిలించే విధంగా ప్రస్తుత అవసరాలను గుర్తించి కవులు తమ కవితా వస్తువులను ఎంపిక చేసుకోవాలని కోరారు. ముగ్గురు కవులు సమాజ హితం కోరుతూ రచనలను చేశారన్నారు".

**-డా.వైరాగ్యం ప్రభాకర్,** అధ్యక్షులు ఉదయసాహితి, కరీంనగర్. 9014559059




**తెలుగు**
**కార్టూనిస్టుల**
**దినోత్సవం**
**కామిక్స్‌త్సవ్**
**చేద్దాం!**

**మే హాస్యానందం సంచిక**

**కామిక్ స్పెషల్** గా రూపొందుతుంది.

**కార్టూనిస్ట్‌లు- ఒక పేజీలో**

**బొమ్మల కథ గీసేరంటే మీరో షార్ట్‌ఫిల్మ్**

**డైరెక్టర్లూ అయిపోయినట్టే!**

**తక్కువ షాట్స్‌తో చక్కటి కథ చెప్పండి...**

**కామిక్ స్పెషల్ ఇష్యూలో రిలీజ్ చేద్దాం!**

**ఏప్రిల్ 20 లోగా**

**మీ నవ్వుల అస్త్రాలు మాకు చేరితే...**

**ఈ కామిక్ స్పెషల్**

**సంచికలో మీకో**

**పేజీ ఉన్నట్టే!**

# పూర్వాభాద్ర

వేదనాగ ఫౌండేషన్ ఉగాది హాస్యకథల పోటీలో ప్రథమ బహుమతి పొందిన కథ






పొత్తూరి విజయలక్ష్మి, 9949059007

**"ఏమండీ చూసారా!... సూరి బావ గారికి మళ్లీ వచ్చిందిట!!" ఇల్లెగిరి పోయేలా కేక పెట్టింది నీరజ.**

**"ఏవొచ్చింది?! వైరల్ ఫీవరా?" అడిగాడు శ్రీధర్.**

**"ఛా! కాదు!! పోటీల్లో బహుమతి వచ్చిందిట."**

**"మళ్లీనా? ఎంతట?"**

**"మూడు వేలు."**

**"ఓస్ అంతేనా! వంటావిడ వాణి గారికి వరలక్ష్మీ వ్రతం నాడు వంట చేస్తే ఇస్తారు ఆ మాత్రం."**

"చాల్లే వూరుకొండి. కథలు రాయటం అంటే మాటలా. చూడండి మెసేజ్ పెట్టి గంట కాలేదు అప్పుడే ఎన్ని కామెంట్ లు వచ్చాయో!" అని ఫోన్ చేతిలో పెట్టింది.

జాతరలో జనం లా పోటెత్తాయి కామెంట్స్.

'యాభై ఏళ్ల వయసులో కలం పట్టి విజృంభించి రాస్తున్న సూర్యానికి అభినందనలు.'

'క్రికెట్‌లో ధోని రచనల్లో మా సూరి బావ!'

'మన వంశ గౌరవాన్ని ఇనుమడింపజేస్తున్న సూర్యం!'...


అంటూ బోలెడన్ని మెసేజ్‌లు

"చూసారా?" అడిగింది.

"ఆ! చూసా! మీ గ్రూప్ కి పనా పాడా! మా ఇంట్లో పాలు విరిగి పోయాయి... అన్నా వెల్లువలా వచ్చి పడి పోతాయి కామెంట్లు. మీ కన్నా ఛానల్ వాళ్ళు నయం!" విసుక్కున్నాడు. ఒళ్ళు మండిపోతోంది అతనికి.

సదరు సూర్య నారాయణ శ్రీధర్‌కి స్వయానా తోడల్లుడు. ఆ మధ్య ప్రమోషన్ మీద సీట్ మారాడు. అదో పిచ్చి పోస్ట్.

బల్ల దగ్గర కూచుని రోజు మొత్తం మీద అరడజను సంతకాలు




పెట్టటం. అంతే! అంతకు మించి పనేం లేదు. ఎంతసేపని గోళ్ళు కొరుక్కుంటూ కూచుంటాడు! కాలక్షేపం కోసం ఏదో రాయటం మొదలు పెట్టాడు. పత్రికలకి పంపించాడు. శతభిష అని జన్మనక్షత్రం పేరు కలం పేరుగా పెట్టుకున్నాడు.

ఒకటి రెండు కథలు అచ్చయ్యాయి. బంధువులు సంబరపడిపోయారు ఆ శతభిష ఎవరో కాదు మన సూర్యమే అని చెప్పుకున్నారు.

ఆ తరువాత శతభిషకు కథల పోటీలో బహుమతి వచ్చింది. అత్తారింటి వాళ్లు ఏమీ లేకపోతేనే హడావిడి చేసేస్తారు. మరి ఇటువంటి అవకాశం వస్తే ఊరుకుంటారా! ఒకటే డబ్బా కొట్టేసుకుంటున్నారు.

ఏవిటో అంత గొప్ప కథ అని పనిగట్టుకుని చదివాడు. ఏడ్చినట్టు ఉంది.

హీరో పేరు రాము. వాడికి ఉద్యోగం ఉంది. జాలిగుండె కూడా వుందిట.

వీధి పంపు దగ్గర నీళ్లు పట్టుకునే ఆడవాళ్లను చూసి భరించలేక తెల్లారుజామునే లేచి తన ఇంట్లో పంపు నించి నీళ్లు పట్టి వీధిలో అందరికీ తలా ఒక బిందెడు ఇచ్చి వస్తాడుట. ఆడవాళ్ళందరూ కృతజ్ఞతతో నీళ్ళ అన్నయ్య నీళ్ళ అన్నయ్య అని ఆనందంతో కళ్ళనీళ్ళు పెట్టుకుని ఉమ్మడిగా వచ్చి రాఖీ పండుగ నాడు అతనికి రాఖీలు కడతారు.

అదీ కథ...

అదో కథ. దానికి ఓ బహుమతి. అది చూసి వీళ్లంతామెచ్చి మేకతోలు కప్పటం.

ఆయన తెగ సంబరపడి పోవటం.

ఓవర్ యాక్షన్ అని విసుక్కున్నాడు శ్రీధర్.

ఆమధ్య ఏదో ఫంక్షన్‌లో కనిపించాడు అదివరకు లా కాకుండా పంచకట్టు, నిలువు బొట్టు తెగ ఫోజులు కొడుతున్నాడు.

మావగారేమో "మా పెద్దల్లుడు. రచయిత శతభిష." అని గర్వంగా అడిగినవారికి అడగనివారికి పరిచయం చేయటం.


"మా బావను చూడండి. మీరూ వున్నారు ఎందుకూ?" అని అర్ధాంగి నసుగుడు.

ఒళ్లు మండిపోతోంది శ్రీధర్‌కి

ఇప్పుడు మళ్లీ ఇంకో బహుమతి వచ్చింది.

ఇలా అయితే నా బ్రతుకు బజారు అయిపోతుంది. ఏదో చెయ్యాలి అనుకున్నాడు కసిగా. ఇంకోటి మరోటి ఎందుకు తనూ రచనలే చేస్తే చిన్న గీత పక్కన పెద్ద గీత గీసినట్లు అవుతుంది. కాకపోతే అతని లాగా కథ రాస్తే అతన్ని కాపీ కొట్టినట్టు అవుతుంది కాబట్టి ఇంకేదైనా ప్రక్రియ ఎంచుకోవాలి. ఆవేశం వుంది. కానీ ఏం చేయాలి?! అసలు ఎట్లా ఆరంభించాలి తెలియటం లేదు.

భార్యతో చర్చించాడు.



నీరజ చాలా సంతోషించింది.

"మీరు కూడా రచనలు చేసి పేరు తెచ్చు కుంటే ఇంతకంటే నాకేం కావాలి! నా వంతు సహాయ సహకారాలు అందిస్తాను." అన్నది.

అంతలోనే అదృష్టం కలిసి వచ్చి అతనికి ఒక గ్రూపుతో పరిచయం ఏర్పడింది. ఇంటికి వచ్చి భార్యకు ఆ శుభవార్త వినిపించాడు.

"ఏం గ్రూపు?" అడిగింది నీరజ.

"కొ ర సం."

"అంటే??"


"కొత్త రచయితల సంఘం.'

"ఇంకా మీరు రచయిత కాలేదుగా! అప్పుడే మీకో సంఘం కూడానా! ఒక కథ అయినా అచ్చయ్యాక అప్పుడు చేరండి సంఘంలో" అంది.

"అలా అని ఏమైనా రూల్ ఉందా ముందు చేరి తరవాత రాస్తే ఎవరైనా ఉరి తీస్తారా?" నిలదీసి అడిగాడు.

"ఉరి తీయరు గానీ అందరూ కొత్తవాళ్లతో అయితే ఏం ప్రయోజనం. పేరున్న రచయితలు ఎవరైనా ఉంటే వాళ్లు సలహాలు చెబుతారు అప్పుడు బాగుంటుంది." అన్నది.

"అవన్నీ పాత రోజుల్లో. ఇప్పుడు ఎక్కడ చూసినా ఈర్ష్య, అసూయ. ఒకరిని చూసి ఒకరు కుళ్లుకోటం తప్ప మరొకరిని భుజం తట్టి ప్రోత్సహించే వాతావరణం లేదు... అందరూ కొత్తవాళ్లయితేనే సుఖం." అన్నాడు.




కొరసం సభ్యులు వారానికి ఒకసారి ఎక్కడైనా కలుసుకుని రచనా వ్యాసంగం గురించి మాట్లా డుకుంటారు.

కొత్త సభ్యుడు చేరగానే అతని ఇంట్లో మీటింగ్ పెట్టటం కొరసం అలవాటు. శ్రీధర్ ఇంట్లో కొరసం సమావేశం ప్రారంభమైంది.

ప్రస్తుతం నవలలకు కొరతగా ఉంది. తెలుగు కథలు వర్షంలా కురుస్తున్నాయి కాబట్టి నవల రాస్తే బావుంటుంది అనుకున్నారు.

అది యదార్థమే. కానీ అమ్మో ఏకంగా నవల రాయటం అంటే మాటలా! అని భయపడ్డారు.

శ్రీధర్ మాత్రం జంకలేదు.

"కొడితే ఏనుగు కుంభస్థలాన్ని కొట్టాలి!" అన్నాడు.

"సరే మీరే మాకు స్ఫూర్తి. మీరు మొదలు పెట్టండి. వారం వారం మనం కలుస్తాము కదా! అప్పుడు చదివి వినిపించండి. సలహాలు సర్దుబాట్లు చేసుకోవచ్చు." అన్నారు.

ఆనాటి సమావేశం ముగిసింది.

బుర్ర వేడెక్కిపోయేలా ఆలోచించి మూడు పేజీలు రాశాడు.

మర్నాడు భార్యకు వినిపించాడు.

"ప్రకృతి ఒడిలో ఒక పల్లెటూరు రామాపురం. రామాపురంలో పెద్ద ఆసామీ సోమ శంకరం గారు. వారి భార్య సోమలక్ష్మి. వాళ్ళకి నలుగురు కొడుకులు. రాజారావు, భీమారావు, సుబ్బారావు, గోవిందరావు.

రాజారావు భార్య రాజ్యలక్ష్మి. భీమారావు భార్య భీమలక్ష్మి. సుబ్బారావు భార్య సుబ్బ లక్ష్మి. గోవిందరావు భార్య గోవింద లక్ష్మి.


రాజారావుకు ముగ్గురు పిల్లలు. కుమార్, ఈశ్వర్, ముకుంద్. భీమారావుకు ముగ్గురు పిల్లలు. వసంత, కళ్యాణి, భైరవి.

సుబ్బారావుకి నలుగురు పిల్లలు సూర్యం, సత్యం, విశ్వం, చంద్రం.

గోవింద రావుకి పిల్లలు లేరు. అతని బావ మరిది నారాయణ. అతనికి నలుగురు పిల్లలు. అచ్యుత, కేశవ, మాధవ, రుక్మిణి...."

అంటూ చదువుతూ అనుమానం వచ్చి






భార్యను చూసాడు.

హాయిగా నిద్ర పోతోంది.

ఒళ్ళు మండిపోయింది అతనికి. వీపు మీద ఒక్కటి వేశాడు.

ఉలిక్కి పడి లేచింది నీరజ.

"నేను చదువుతుంటే వినకుండా నిద్ర ఏమిటి?" అని కోప్పడ్డాడు.

"ఏమిటో హూద్ హూద్ తుఫానులాగా అన్ని పాత్రలు వచ్చేసరికి అయోమయంగా వుంది. కళ్ళు మూసుకుని పోయాయి." అంది.

"అంతేలే! నీ వంటి నిరక్షర కుక్షి దగ్గర చదవటం నాది బుద్ధి తక్కువ!" అన్నాడు.

మరుసటి వారం కొరసం సమావేశంలో తను రాసింది చదివాడు.

బాగుంది అన్నారు వాళ్లు. ఓ పది పేజీలు రాసే సరికి అతనికే విసుగేసింది.

"ఏమిటో అన్ని పాత్రలు పేర్లు గుర్తు పెట్టు కోవడం కష్టంగా ఉంది" అన్నాడు భార్యతో.

"రాసేవాళ్ళు మీకే అయోమయంగా ఉంటే చదివే వాళ్ళకి ఎలా ఉంటుంది! కురుక్షేత్ర యుద్ధంలో లాగా అన్ని పాత్రలు ఎందుకు? కాస్త తక్కువ పాత్రలతో నవల ప్రారంభిస్తే మీకూ సుఖం. చదివే వాళ్ళకి సుఖం" అన్నది నీరజ.

ఆ నవల అక్కడ ఆపేసి మరో నవల ప్రారంభించాడు.

సునీల్ సుచిత్రలకు రెండు నెలలు క్రితం పెళ్లి అయింది. వాళ్ళు చాలా అన్యోన్యంగా కాపురం చేసుకుంటున్నారు.

సునీల్ ఆఫీస్ పని మీద బెంగుళూర్ వెళ్ళాడు. పని పూర్తి చేసుకుని స్టేషన్‌కు వెళ్లి రైలు ఎక్కుదాం అని బయలు దేరాడు. దారిలో ఆటోను లారీ గుద్దింది. అక్కడికక్కడే ప్రాణం పోయింది....

అని రాసి సమావేశంలో కొరసం వాళ్ళకి వినిపించాడు.

"అద్భుతం! అమోఘం!! మొదటి సీన్‌లోనే హీరో చచ్చిపోవటం చాలా గొప్ప ఆరంభం... ఈగ సినిమాలాగా మీ నవల కూడా సూపర్ హిట్ అవుతుంది" అని ప్రోత్సహించారు.

నీరజ మాత్రం– "శుభమా అని నవల మొదలు పెట్టి మొదటి వారంలోనే హీరోని చంపేయడం ఏమిటండి ?" అన్నది.

"పోనీ రెండో వారంలో చంపనా?"అన్నాడు.

"హీరోను చంపాలనే ఆలోచన ఎందుకు వచ్చింది?"

"వద్దంటావా!?... అయితే హీరోయిన్‌ను చంపేస్తాను. సునీల్ బెంగుళూరు నుండి వచ్చే సరికి సుచిత్ర చచ్చి పోయింది."

"హీరోయిన్ పోతే మిగిలిన కథ ఎట్లా నడుస్తుంది??"

"పాయింటే! ఓ పని చేద్దాం. వాళ్ళిద్దరినీ సజీవంగా ఉంచుతాను. సునీల్ మేనత్త కొడుకు రామరాజు, సుచిత్ర మేనమామ కొడుకు భీమ రాజు వీళ్ళ ఇంటికి వచ్చారు."

"బావుంది. కొత్త మొహాలు ప్రవేశించాయి." అంది నీరజ.

"రామరాజు, భీమరాజు సినిమాకెళ్లి వస్తుంటే యాక్సిడెంట్ అయింది... ఇద్దరూ చచ్చి పోయారు."

"హరి హరీ ఈ చంపే గోల ఏమిటండీ?"

"మరి క్యారెక్టర్ వైండప్ చెయ్యాలిగా?"

"ఒక పాత్రను సృష్టిస్తే దాంతో కొంత కథ నడపాలి. వర్ణనలు, సన్నివేశాలు వుండాలి. చివర్లో చెయ్యాలి వైన్‌డప్పు! మొదటి వాక్యంలో సృష్టించి రెండో వాక్యంలో చంపేస్తూ వుంటే






ఎవరు మిగుల్తారు? నవల ఎలా రాస్తారు మీ తలకాయ? " అంది విసుగ్గా

మర్రోజు మరో మూడు పేజీలు రాశాడు... భార్యకు వినిపించాడు.

"తెల్లవారింది. చెట్టు మీద పిట్ట కూ...కూ అని కూస్తోంది. పనిమనిషి బర్రూ... బర్రు మని వాకిలి చిమ్ముతోంది. స్టౌ మీద నీళ్లు సల... సలా మరుగుతున్నాయి. పక్కింటి కాంతారావు ఖల్లు...ఖల్లు మని దగ్గుతున్నాడు."

"ఇక చాలు ఆపండి! ఏమిటీ శబ్దాలు? కథ ఏదీ?!" అని విసుక్కుంది.

"సరే సన్నివేశం రాస్తాను! నువ్వు వంట చేసుకో." అన్నాడు.

ఒక సన్నివేశం రాసి... వంటింట్లోకి పట్టుకెళ్ళాడు.

"సుచిత్ర సునీల్ ఆఫీసుకు వెళ్ళగానే బకెట్లో సగం దాకా నీళ్లు పట్టి చారెడు టైడ్ పొడి వేసి అతని ప్యాంటు, షర్టు, అండర్‌వేర్స్, తన చీర, జాకెట్టు,అండర్ వేర్స్... నానబెట్టి బండకేసి బాది నీళ్ళలో బాగా జాడించి పిండి దులిపి... తాడు మీద ఆరవేసింది." అంటూ సన్నివేశం చదివి భార్య వంక చూశాడు.

"ఆవదం తాగినట్టు ఏమిటి మొహం అట్లా పెట్టావ్?" అన్నాడు విసుగ్గా!

"మీరు రాసింది విని! అసలు మీరు ఏం రాయదలచుకున్నారూ?" నిలదీసింది.

"ఏమో ఇంకా ఏమీ అనుకోలేదు ఆ విషయం గురించి." అన్నాడు.

"అంటే ఓ కథ అని అనుకోలేదా?"

"అలా ఏం అనుకో లేదు. ఎప్పటికప్పుడు బుర్రలో ఏం ఆలోచన వస్తుందో అది రాసేస్తాను!" అన్నాడు.

"బాగానే వుంది సంబడం. అలిగి ఇంట్లోంచి వెళ్లి పోయి ఎక్కడికి వెళ్ళాలో తెలియక ఏబ్రాసి మొహం వేసినట్లు ఓ కథ అంటూ లేకుండా నవల మొదలు పెడితే అది ఇలానే ఏడుస్తుంది. ముందు ఒక విషయం అనుకోండి. ఆ తర్వాత దానితో కథ అల్లండి..." అని సలహా ఇచ్చింది.

ఒక గంట తీవ్రంగా ఆలోచిస్తే వచ్చింది కొత్త ఐడియా –"శుక్రగ్రహం మీదికి వెళ్తాడు హీరో. మార్స్ నుండి వస్తుంది హీరోయిన్. వాళ్లిద్దరూ శుక్రగ్రహం మీద పరిశోధనలు జరుపుతూ ప్రేమించుకుంటూ చివరికి పెళ్లి చేసుకుంటారు ఎలా ఉంది నా నవల?" అని అని అడిగాడు.

"మన ఇంటికి తూర్పుదిక్కు ఎటువైపు ఉందో ఎప్పుడూ అనుమానమే మీకు. అటువంటిది మీకు శుక్రగ్రహం గురించి ఏం తెలుసని నవల రాస్తారు?"

"గూగుల్ ఉందిగా అందులో చదివి రాస్తాను."

"మనకు కొంత తెలిస్తే మిగతా సమాచారం కోసం గూగుల్ మీద ఆధార పడవచ్చు. ముందే ఏమీ తెలియకుండా గూగుల్‌ని నమ్ముకుంటే సొరకాయ బుర్ర పట్టుకుని సముద్రం ఈదినట్లే."

"నువ్వొకతివి! నక్షత్రకుడు లాగా ప్రతిదానికి అడ్డు పడిపోతున్నావ్! ఇలా అయితే నేను ఏం రాయను?... మా కొరసం వాళ్ళు చూడు. నేను ఏం చెప్పినా శభాష్ అంటారు." విసుక్కున్నాడు.

"మీకు తోడు పోయిన వాళ్లే మీ కొరసం వాళ్లు. ఎన్ని పంపినా తిరిగి రావటం తప్పించి నాలుగు కథలు అచ్చయిన వాళ్ళే లేరు... కొన్నాళ్ళు ఆ కొరసంను పక్కన పెట్టేసి మంచి కథలు చదివితే ఓ ఐడియా వస్తుంది." అని సలహా ఇచ్చింది.

కొన్నాళ్ళు రాయటం మానేసి మంచి కథలు చదివాడు.

"వాళ్లంతా చాలా గొప్పగా రాశారు... నేను అలా రాయగలను అంటావా?" అన్నాడు కాస్త దిగులుగా.

"నిజంగా రాయాలని కోరిక ఉంటే, మొదలు పెట్టండి. వాళ్లంతా కూడా పుడుతూనే రాసే సారా?" ప్రోత్సహించింది

"ఏం రాయను?... మంచి కథాంశం దొర కాలి కదా!"

"మీ అనుభవాలు రాయండి."

"రాయటానికి ఏమున్నాయి?పెద్దలు కుదిర్చిన పెళ్లి, సంసారం, ఉద్యోగం, గానుగెద్దు జీవితం అంతేగా!"అన్నాడు నిరుత్సాహంగా.

"మీ జీవితం అంటే మీదే కాదు. మీరు చూసిన వ్యక్తుల గురించి రాయండి." సలహా చెప్పింది.

"అంటే నీ ఉద్దేశం!"

"మీ తాతయ్య గారి గురించి రాయండి."


"ఎప్పటివో పాత చింతకాయ పచ్చడి లాంటి సంగతులు రాస్తే చదివేవాళ్ళు చదువుతారా?"

"కళ్ళకద్దుకుని చదువుతారు! జీవితమే ఒక పెద్ద కథ. అనుభవాలను అందంగా చెప్తే అందరికీ నచ్చుతుంది. ఎక్కడో వెతుక్కుని ఏదో రాయటం కంటే మనకు తెలిసిన విషయం రాయటం సుఖం.సంధులు, సమాసాలంటూ కఠినమైన భాష జోలికి పోకుండా సరళంగా రాస్తే కళ్ళకద్దుకుని చదువుతారు" అంది.

శ్రీధర్‌కి భార్య సలహా తీసి పారేయాల్సింది కాదు అనిపించింది.

ఆ రాత్రి సరిగా నిద్ర పట్టలేదు. మర్నాడు పొద్దున్నే లేచి మొదలు పెట్టాడు.

కొండవారిపల్లె. మారుమూల ఓ కుగ్రామం.




అందులో జన్మించాడు రాఘవరావు. ఆయనకు కాస్త జ్ఞానం వచ్చే సరికి స్వాతంత్ర్య పోరాటం ముమ్మరంగా నడుస్తోంది....

అంటూ మొదలు పెట్టాడు.

యాభై ఎకరాల సుక్షేత్రమైన భూమి వున్న ఆసామీ అయిన ఆయన రెండు జతల ఖద్దరు బట్టలతో, ఎంత నిరాడంబరంగా జీవించాడో దేశం కోసం ఆయన ఏం త్యాగం చేశాడో రాశాడు... పిల్లలకు వారసత్వపు ఆస్తిగా నిస్వార్థం, పరోపకారం అందించిన విషయం రాశాడు. కేవలం నాలుగు వందల ఖర్చుతో కూతురి పెళ్లి ఎట్లా చేశాడో రాశాడు.

మొదలు పెట్టాక భూమిలోని జలలా పొంగి వచ్చాయి ఆలోచనలు.

రాస్తూ భావోద్వేగానికి గురయ్యాడు.

వింటున్న నీరజకి కళ్ళు చెమర్చాయి. పూర్తి చేసి పత్రికకు పంపించాడు. ఆడపిల్లను అత్తారింటికి పంపించినట్టు గుండె బరువెక్కింది అతనికి.

కొన్నాళ్ళు గడిచాయి. ఒక రోజు అతనికి ఫోన్ వచ్చింది. మీరు రాసిన నవల ప్రచురణ కు స్వీకరించామని.

ఎగిరి గంతులు వేశాడు శ్రీధర్. పరుగున వెళ్లి భార్యకి ఈ శుభవార్త చెప్పాడు.

రాసింది తనైనా మొత్తం ఘనత అంతా నీదే అన్నాడు. నీరజ ఆనందం అంతా ఇంతా కాదు. గ్రూప్‌లో పెడతానంటూ పరుగున వెళ్లి పోస్ట్ చేసేసింది.

అందరూ ఆశ్చర్యపోయారు... తోడల్లుడు రాస్తునా డని పంతానికి పోయి ఏదో రాసి పారేసీ వుంటాడు అనుకున్నారు ఎగతాళిగా.

తీరా 'మహానుభావుడు' సీరియల్ మొదల య్యాక గొప్పగా రాశాడు అని మెచ్చుకున్నారు.

ఓ పెళ్ళిలో అతగాడి మామగారు "ఇతను మా చిన్నల్లుడు. రచయిత. పూర్వాభాద్ర అనే కలం పేరుతో రాస్తాడు." అని పరిచయం చేస్తుంటే గర్వం కలగాల్సింది పోయి మొహ మాటం వేసింది శ్రీధర్‌కి.

ఆ మాటే భార్యతో చెప్తే ముచ్చట పడింది.

"ఇదే రచయితకు వుండాల్సిన ముఖ్య లక్షణం. ఇక మీకు తిరుగు లేదు పూర్వాభాద్ర గారూ!" అంది మురిపెంగా.



# ఎటుపోయి ఎటొస్తుందో...




**వేదనాగ ఫౌండేషన్ ఉగాది హాస్యకథల పోటీలో ద్వితీయ బహుమతి పొందిన కథ**




గంగాధర్ వడ్లమన్నాటి, 9908445969

**మధు,లలితలిద్దరికీ పెళ్ళై ఆరునెలలవుతోంది.**

**తిరుపతి వెళ్ళి వస్తూ, మావయ్య శేఖరం వాళ్ళింటికి సర్ప్రైజింగ్‌గా వెళ్దాం అని నిడదవోలులో దిగారు.**

**తీరా ఇంటికి వెళ్ళి చూస్తే, తాళం పెట్టి ఉంది. వీళ్ళని మనం సర్‌ప్రైజ్ చేద్దామని వస్తే, వీళ్ళేంటి మనికి షాకిచ్చారు అని ఉసూరుమన్నాడు మధు.**

**సరే చేసేది లేక ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు.**

తర్వాత మధు ఫోన్ చేసి విషయం అడగ్గా, వాళ్ళ అత్తగారు పోయిందని, ఫ్లయిట్‌లో బెంగళూరు వెళ్ళారట. అన్నీ చూసుకుని రావడానికి ఓ మూడు రోజులు పడుతుంది మీరు ఎదురింట్లో తాళాలు తీసుకుని ఉండండి అన్నాడు శేఖరం.

సరే మాకూ కొంత ఏకాంతం దొరుకుతుంది. పైగా పల్లెటూరులో సరదాగా గడిపినట్టూ ఉంటుంది అని సరే అన్నాడు మధు.

స్నానం పానం చేసాక, మధులలితలిద్దరూ ఎదురుబొదురుగా కూర్చున్నారు.

"ఏంటీ అలా చూస్తున్నారు?" అడిగింది లలిత సిగ్గుతో వంకర పోతూ.


"తిన్నది అరక్కే ఇలాంటి పనులు! నీ కళ్ళు కాకులెత్తుకెళ్ళా!" అంటూ కుడి పక్క పోర్షన్ నుండి పెద్ద అరుపులు వినిపించాయి.

ఇద్దరూ ఓ క్షణం ఇత్తడి బిందె నెత్తిన పడ్డట్టు బిత్తరపోయి, కుంకుడురసం తాగినట్టు మొహాలు పెట్టి, మరుక్షణం తేరుకున్నారు.

తర్వాత మళ్ళీ మధు, లలిత వంకే చూస్తూ, "నీ కళ్ళలో ఏదో మత్తు కనిపిస్తోంది గమ్మత్తుగా."

"ఏడిసావ్! నువ్వూ నీ పైత్యం మాటలూనూ! నీ కళ్ళకి కళ్ళకలక రానూ! "అంటూ ఈ సారి ఎడం పక్క పోర్షన్ నుండి అరుపులు




వినిపించాయి. ఆ తర్వాత ఆ కేకలూ, శాప నార్థాలూ, అరుపులూ, తిట్లూ ఇరువైపుల నుండీ ముందు కాస్త బొటా బొటిగా వినిపించినా తర్వాత పోటా పోటీగా వినిపించ సాగాయి.

అవి మధ్యాహ్నం, సాయంత్రం కూడా అలాగే యధాతదంగా వినిపించాయి.

'అయ్యో! ఇలాంటి ఇంట్లో మావయ్య ఎలా ఉంటున్నాడో' అనుకున్నాడు.

తర్వాత రెండు రోజులకి శేఖరం వచ్చేసాడు. కానీ ఆ రెండు పోర్షన్ల నుండీ ఆ రోజు మొత్తం కనీసం చిన్న మాట కూడా వినిపించక పోవడంతో చాలా ఆశ్చర్యపోయాడు.

"ఏరా మధూ! ఏం చేసావ్? వీళ్ళిద్దరూ కోడి పుంజుల్లా కొట్టుకునేవారు. అలాంటిది, ఇలా ఇంత నిశ్శబ్దంగా ఉంటున్నారంటే చాలా ఆశ్చర్యంగా ఉందిరా! ఏం చేసావురా వాళ్ళని?... అలా మ్యూట్‌లోకి మారిపోయారు?" అడిగాడు శేఖరం చిరునవ్వుతో.

"నేనంటే ఏమనుకుంటున్నావ్ మావయ్యా! నేను అనుకుంటే అంతే. అసలు జరిగిందేవిటంటే, నేను మొన్న సాయంత్రం బయటకు వెళ్ళి వస్తున్నాను. దారిలో తెలిసిన స్నేహితుడు ఒకడు కనిపించాడు... మాటల సందర్భంలో ఈ విషయం చెప్పాను... అతనికి తెలిసిన పోలీసు కానిస్టేబులుని పంపి వీరిద్దరినీ పిలిచి ఇలా అయితే న్యూసెన్స్ కేసు పెట్టాల్సిఉంటుందనీ... కనుక ఈసారి నుండి ఇలాంటివి చేయవద్దని ఆ రెండు పోర్షన్‌లలో ఉంటున్న ఇరువురినీ కొంచెం గట్టిగా హెచ్చరించాడు. దాంతో పులుల్లా గాండ్రించేవారు కాస్తా ఇలా పిల్లుల్లా మారిపోయారు." చెప్పాడు మధు కాస్త గర్వంగా.





"తివిరి, యిసుమున దైలంబు దీయవచ్చు, జేరి మూర్ఖుల మనసు రంజింపరాదు. అంటే గట్టి ప్రయత్నంతో ఇసక నుండి తైలం తీయవచ్చు కానీ మూర్ఖుల మనసు మార్చలేం అనే భర్తృహరి మాట గుర్తొస్తోంది. అలాగే ఉత్తమే క్షణ కోపః, పాపిష్టే మరణాన్తక అని. అంటే కోపం ఉత్తములకి క్షణం, ఇలాంటి పాపిష్ఠులకి పోయే వరకూ ఉంటుందని అర్థం. ప్రస్తుతానికి సరే అనుకో" అని సందేహంగా క్షణం ఆగి...

"ఏది ఏమైనా మొత్తానికి అసాధ్యుడివేరా! అసలు, నేను అద్దెకి వచ్చిన కొత్తలో, అంటే ఓ సంవత్సరం కింద, ఇద్దరూ కొంతలో కొంత బాగానే ఉండేవారు. అయితే ఓ సారి పొరబాట్న మేడమీద ఎండేసిన లంగాల్లో ఒకటి కనబడకుండా పోతే నువ్వు చూసావా వదినా అని కుడి పోర్షనామె ఎడం పోర్షనామెని అడగ్గా...

"ఆః! నాకేం పని అలాంటి బట్టలు మా

పనిమనిషి కూడా కట్టదు... అలాంటిది నాకు ఆ మాత్రం తేడా తెలీదనుకున్నావా! అయినా మా ఆయన లుంగీలు కూడా రెండు కనబడ కుండా పోయాయి. సరే పోతే పోనీ అని వది లేసాను... అప్పుడు ఆయన పెద్ద మనసుతో చిన్న తువాలు చుట్టుకుని గడుపుకున్నారు. కానీ నేను కనీసం నిన్ను ఓ మాట అగడలేదు. అలాంటిది... లంగా కోసం నన్ను దొంగని చేస్తావా?! అంటూ గైమంది. అలా రాజుకున్న వైరం, వారి కోపం, మూర్ఖత్వంతో రోజుకో మలుపు తిరుగుతూ వచ్చి చివరికి వారి మధ్య ఓ సుడిగుండం ఏర్పడింది. అది రోజుకో హుద్దద్ తేసాగింది. పొద్దున కుళాయి దగ్గర, కుడి పోర్షన్ కుమారి, ఆ సత్తుబిందావిడ నీళ్ళు పట్టాక పడతానండీ అనేది.




అవునండీ ఆమెది రాగిబిందే అయినా సొట్టలెక్కువ తెలుసా మీకు అనేది ఆ ఎడం పోర్షన్ యమున.

అవునే నా బిందెకే సొట్ట కానీ నీ మొహవే సొట్టబట్ట చెంబు మొహం కదా! అని కుమారి అంటే నా లాంటి సొట్టబద్ద మొహానికి అర విందస్వామిలాంటి మొగుడొచ్చాడే. కానీ నీకు ఉన్నాడుగా మొగుడు... ముంతకాయలా మొహం వాడూనూ అనేది యమున.

నీ మొగుడు అరవిందస్వామిలా ఉన్నా నీ కన్నీ నాసిరకం చీరలు కొంటాడే. మా ఆయ నది ముంతకాయ్ మొహం అయినా, మాంచి కాంచీవరం చీరలు కొంటాడు తెలుసా అని కుమారి అంటే...

అవును నీ మొగుడు చీరలు కొంటాడు. తర్వాత చీప్‌లిక్కర్ కొడతాడు. ఎవరికి తెలీదూ. మా ఆయన నాసిరకం చీరలు కొన్నా నాసికా నికి సూటిగా పోయేవాడే అని యముననేది.

నీ మొగుడు చచ్చు.

నీ మొగుడు పుచ్చు.

మీ ఆయన ఎలకని చూస్తే భయపడతాడే.

మీ ఆయన గిలకని చూసినా భయపడతాడే.


ఇదిగో నన్నను... మా ఆయన్నంటే ఊరు కోను. ఆయనది ముంత మొహవే కానీ... ఆయన కబడ్డీ ప్లేయరే.

అవున్లే! కబడ్డీ ఆడేవాడు కాబట్టే నిన్ను తట్టు కోగలుగుతున్నాడే. మా ఆయన లాంటి వాడ యితే ఉరితాడుకు వేలాడేవాడు. అంటూ వారి ష్టమొచ్చినట్టు, అలుపొచ్చేవరకూ తిట్టుకునే వారు. తర్వాత్తర్వాత ఇద్దరూ, పాకిస్తాన్, ఇండియాలా తయారయ్యారు. నేను మధ్యలో కాశ్మీర్‌లా నలిగిపోయాను. నువ్వు మూడు వందల డెబ్భై ఆర్టికల్‌లా వచ్చి నన్ను రక్షించావు చెప్పాడు శేఖరం మధు భుజం తడుతూ.

తర్వాత మధు దంపతులు వైజాగ్ వచ్చేసారు.

కొద్దిరోజుల తర్వాత, ఓసారి శేఖరం మధుకి ఫోన్ చేసాడు. అన్నీ మాట్లాడాక ఇంకా పక్కింటి పిల్లులు గోల చేయడం లేదుకదా అడిగాడు మధు నవ్వుతూ.


"ఏం చెప్పమంటావురా నాయనా! అదో పేద్ద బేతాళ కథ! నువ్వెళ్ళిన మరుసటి రోజు నుండే మా బట్టలు గాలికి ఎగిరి సరిగ్గా ముళ్ళ కంపలపై పడి చిరిగిపోసాగాయి. అది కూడా నా లుంగీలు చిరగకూడని చోటే చిరిగిపో యుండేవి... మా ఇంటి ముందే ఎవరో పొద్దునకే చెత్త వేసి పోయేవారు. సరిగ్గా మా టి.వి డిష్ మాత్రమే గాలికి కిందపడి విరిగి పోయింది. నా స్కూటర్ సీటు మొదట చిన్న చిరుగు పడింది. తర్వాత రోజది కజ్జి కాయ సైజుకి పెరిగిపోయింది... మొన్న ఎండలో



ఎండేసిన మీ అత్తయ్య సవరం పోయింది. పెరట్లో మొరం చెట్టు పోయింది. సరే వాళ్ళతో సమరం కంటే సంధే నయం అని వారిని మంచి చేసుకుందామని మైసూరు పాక్ ఇస్తే, ఒకావిడ వీధి కుక్కకి క్యాచ్ అంటూ విసిరే సిందట. రెండో ఆవిడ చెప్పుల స్టాండు కదల కుండా సపోర్ట్‌గా పెట్టిందట. దాంతో మీ అత్తయ్య ఇంట్లోకొచ్చి, తినేవాటిని ఇలా చేస్తారా వ్వా అంటూ ఏడుపు లంకించుకుంది. ఇలా అనేకం జరిగాయంటే నమ్ము."

"అలాగా! నాకు తెలిసిన ఆ పోలీసాయన్ని మళ్ళీ తీసుకెళ్ళి చెప్పించు తిక్క కుదురుతుంది." చెప్పాడు మధు.

అదీ జరిగిందిరా నాయనా! కాకపోతే ఈ సారి ఆ శత్రువులిద్దరూ ఒకటిగా నామీద పడ్డారు. వారిని లైంగికంగా ఇబ్బంది పెడుతు న్నానని చెప్పారు. ఒడియాలు పెట్టేప్పుడు ఆవిడని ఆవడని చూసినట్టు చూసానట. వాళ్ళు బట్టలు ఆరేసే టైము చూసుకుని నేను కావా లని మేడ మీదకి వెళ్ళి ద్వందార్ధపు చూపులు చూస్తున్నానట... విజిలేసి కామెంట్స్ చేస్తు న్నానట... మొన్న ఓ సాయంత్రం మా ఆవిడ పిలుస్తోందని పిలిచి ఆవిడతో పరాచకాలా డానట. కాగితం వ్రాసి ఆవిడ మీదకి విసిరా నట. ఇలా ఎన్ని అన్నా బాధనిపించలేదు కానీ, ఒక్క అబద్ధం మాత్రం నాకు జీవితం మీద విరక్తి తెచ్చింది."





"ఏంటి మావయ్య అది!" అడిగాడు మధు.

"అదేవిటంటే... ఆ కుమారిని నేను ఐశ్వర్యా రాయ్‌లా ఉన్నావని పొగిడానట... అది వింటూనే, నేను ఇద్దరినీ ఓసారి పక్క పక్కనే ఊహించాను. అంతే! రెండు సార్లు వ్యాక్క్ వ్యాక్ అని కక్కుకున్నాను. ఆ ఇన్స్‌పెక్టర్ గారు కూడా వచ్చే కక్కుని ఆపుకుని నోరు నొక్కుకు న్నాడు. ఇలాగే ఏవేవో చెప్పి నా మీద నిర్భయ, దిశ కేసులు పెట్టమని గొల్లుమన్నారు. ఆ పోలీసు కూడా నా వంక అదోలా చూసాడు. ఎటుపోయి ఎటొస్తుందోనని... భయపడి చచ్చాను. ఇక ఇలా కాదని నేనే ఓ నాల్రోజుల క్రితం ఇల్లు మారిపోయాన్రా! నా కష్టం నీకర్ధ మయిందా? అందుకే, 'విద్వానేవ విజానాతి విద్వజ్జనపరిశ్రమమ్' అన్నారు నీతి శాస్త్రంలో. అంటే పండితుల కష్టం పండితులకే కానీ మూర్ఖులకి ఎలా తెలుస్తుంది అని. అయినా వాళ్ళ కోపం, మూర్ఖత్వమే వాళ్ళ కొంపముంచు తుందెపుడో" చెప్పాడు శేఖరం.

ఆ మాటలు విన్న మధు, ఇలా జరిగిందే విటబ్బా! అవున్లే అన్నీ ఇలానే జరుగుతాయని లేదు. ఎటుపోయి ఎటొస్తుందో చెప్పలేం, అని ఆలోచిస్తూ లోనికి పోయి టీ.వీలో ఓ భక్తి ఛానల్ పెట్టాడు.

కోపం, మూర్ఖత్వం మహా చెడ్డవి. కోపము నను ఘనత కొంచెమైపోవును కదా! అలాగే మూర్ఖే పూజ్యతే స్వగృహే. అంటే మూర్ఖులు ఇంట్లోనే ఆరాధింపబడతారు. బయట ఛీ కొట్ట బడతారు అని ఓ స్వామీజీ చెప్తుండటం విన్న మధు, ఆలోచనలో పడ్డాడు. ఇంతలో అతని భార్య వచ్చి వార్తలు పెట్టింది.

నిడదవోలులో కుమారి, యమున అనే ఇద్దరు మహిళల మధ్య మాటలు ముదిరి ఒకరిపై ఒకరు బిందెలతో దాడిచేసుకొనగా, ఒకరు ఆసుపత్రికీ, మరొకరు జైలుకీ పోవడం జరిగింది అనే వార్త చూస్తూ, తగిన శాస్తే జరిగింది వీళ్ళకి అన్న లలితతో ఔను అన్నట్టు చూపులు కలిపాడు మధు. ఇద్దరి ముఖాల్లో చిన్న నవ్వు మెరిసింది.



# టిక్ టాక్...
# టిట్ ఫర్ టాట్!




**వేదనాగ ఫౌండేషన్ ఉగాది హాస్యకథల పోటీలో తృతీయ బహుమతి పొందిన కథ**




జడా సుబ్బారావు, 9849031587

**"అదేమిట్రా... సెన్సె'క్స్ లో సర్వం కోల్పోయినవాడిలా అలా కూర్చున్నావు" అన్నాడు మల్లేశం తన స్నేహితుడు రామేశాన్ని.**

**ఆరిన కుంపట్లో కుక్క ముడుచుకుని పడుకున్నట్లు దుప్పట్లో ముడుచుకున్న రామేశంలో కదలిక వచ్చింది.**

**స్నేహితుడి వంక చూశాడు గానీ ఏమీ మాట్లాడకుండా దిగాలుగా ముఖంపెట్టి కూర్చున్నాడు. వ్యాపారంలో దివాళా తీసినట్టు, కోడిపందాలలో అన్నీ పోగొట్టుకుని ఖాళీచేతులతో ఇల్లు చేరినట్టు, పాత బట్టలకో పులిహోర పొట్లాలకో ఎదురు చూసే వరదబాధితుడిలాగా బిక్కుబిక్కుమంటూ కూర్చున్న స్నేహితుణ్ణి సమీపించి–**

**"ఏమయిందంటే మిడిగుడ్లేసుకుని చూస్తావేరా!... విషయం చెప్పకుండా!" అన్నాడు పళ్ళికిలిస్తూ.**

ఎప్పుడూ తనదే పైచేయిగా ఉండే రామేశాన్ని అలా చూస్తుంటే లోలోపల దీపావళి పండుగ జరిగినట్లుంది. అయినా పైకి కనబడ నీయకుండా అడిగాడు మల్లేశం.

కాసేపటి తర్వాత కప్పుకున్న దుప్పటి ముఖంమీద నుండి పక్కకు తీసి– "ఏమి చెప్పమంటావురా నా బాధ! చారెడు దానిమ్మగింజలిచ్చి దోసెడు మిరియాల్ని కొనుక్కున్నట్టు, గుప్పెడు ఆవాలిచ్చి గొంతుదిగని వేపకాయల్ని తెచ్చుకున్నట్లుంది నా పరిస్థితి..." అన్నాడు గుడ్లు మిటకరిస్తూ.

పోలికలు అర్థంకాక గుటకలు మింగాడు మల్లేశం.

ఏమయింద్రా అంటే ఆవాలు, మెంతులు, వేపకాయలంటూ వెర్రి వెర్రిగా మాట్లాడుతున్న రామేశం వంక విచిత్రంగా చూసి 'కొంపదీసి






వీడి చిన్న మెదడుకి చిల్లు పడలేదు కదా..' అని మనసులో అనుకున్నాడు.


“నా వంక అదోలా చూసి ఏదేదో ఊహించు కోకు. ఆవులిస్తే పేగులు బయటికి తీసి శుభ్రం చేసి తిరిగి యథాస్థానంలో సర్దేయగలిగిన నేను ఎందుకిలా ఉన్నాననే కదా నీ సందేహం?!” మల్లేశం వాలకం చూసి ఏదో అనుమానం వచ్చిన వాడిలా చెప్పాడు రామేశం.

పప్పుబెల్లం పెడతానన్న తల్లిదగ్గర బుద్ధిగా కూర్చున్న పిల్లాడిలా రామేశం దగ్గర కూర్చు న్నాడు మల్లేశం.

“ఇదిగో... నువ్వొకసారి ఆ గదిదాకా వెళ్లి లోపలికి చూసి ఏముందో నాకు చెప్పాలి” అన్నాడు రామేశం.

దొంగాపోలీస్ ఆటాడే పిల్లలు దాక్కున్నట్లు నక్కినక్కి గది దగ్గరకెళ్లి తొంగిచూసిన మల్లేశం అక్కడున్న దృశ్యాన్ని చూసి... బిగుసుకు పోయాడు. నాలుక బయటికి చాచి, జుట్టు విరబోసుకుని ఊగుతూ కనిపించిన ఆకారాన్ని చూసి పరుగు లాంటి నడకతో రామేశాన్ని చేరిన మల్లేశం– “ఎవర్రా లోపల కూర్చుంది? కొంపదీసి చెల్లాయి కాదుగా?” అన్నాడు.

కడుపుబ్బరం తగ్గడానికి కషాయం తాగిన వాడిలా ముఖంపెట్టిన రామేశం–




“కొంపదీయకపోయినా అది మీ చెల్లాయే.” అన్నాడు దుప్పటి తలమీదకి లాక్కుంటూ.

'నా సందేహం కూడా అదే...' అన్నట్లు చూశాడు మల్లేశం.

“ష్!... గట్టిగా మాట్లాడకు. మీ చెల్లాయి టిక్ టాక్ చేస్తుంది. విన్నదంటే బయటికి వచ్చి నాలుగు తగిలిస్తుంది” అన్నాడు రామేశం.

కటికచీకట్లో దారికనబడనివాడిలా తడ బడ్డాడు మల్లేశం... అప్రయత్నంగా ఒక వేలు చెవిలోకి, మరో వేలు జుట్టులోకి ప్రవేశించి రహస్యాన్ని వెలికితీయాలనే ప్రయత్నంలో ఉండిపోయాడు.

“నువ్వంతలా బుర్రచించుకుని... నన్ను నంజుకు తినకు. ఇలా వచ్చి దగ్గర కూర్చో. విషయం చెప్తాను” అన్నట్లున్న రామేశం సైగలతో అతని దగ్గర కూర్చున్నాడు మల్లేశం.

“మీ చెల్లాయి నవలలెక్కువ చదువుతుందని నీకు తెలుసుగా!... నేను ఆఫీసుకి, పిల్లలు స్కూలుకి వెళ్లాక తన సమయమంతా నవలలు చదవడంతోనే గడిపేది. దానివల్ల ఏ ఇబ్బందీ లేదు కాబట్టి ఏ సమస్యా రాలేదు.

మొన్న సెలవల్లో మా చెల్లికొడుకు ఇంటి కొచ్చాడు. వాడు చదివేది పదోతరగతే అయినా వాడికి విపరీతమైన టిక్ టాక్ పిచ్చి. 'ఎర్ర జెండెర్రజెండెన్నియలో' అనే పాట పెట్టుకుని గోళ్లు కత్తిరించుకుంటూ వీడియో తీసి అప్లోడ్ చేస్తాడు... 'అనుభవించు రాజా' అని పాట


పెట్టుకుని పళ్లు తోముకుంటాడు. నురుగు పెదాల చివర్లనుండి కారుతుంటే... దాన్ని వీడియో తీసి అప్లోడ్ చేస్తాడు. ఒకటా... రెండా... మనిషి పుట్టుక పుట్టినవాడు చేయ కూడని గలీజు పనులన్నీ చేస్తూ వీడియోలు తీసి వచ్చే లైకుల్నీ, కామెంట్లనీ మా ఆవిడకు చూపిస్తుండేవాడు.

నవలల పిచ్చిలో పడి కొన్నాళ్లు ఆవిడ వాటిని పట్టించుకోలేదు. 'తినగ తినగ వేము తియ్యనుండు' అన్నట్లుగా ఒకరోజు దానిలో ఏముందో తెలుసుకోవాలని అందులో దిగింది.


ఆ రోజు దిగడం దిగడం ఈ రోజు దాకా అందులో నుండి పైకి తేలలేదు. బావిలో దిగిన వాడు బురదంటించుకున్నట్లుగా అయి పోయింది నా భార్య పరిస్థితి. పిల్లలేమి తింటున్నారో... నేను ఆఫీసుకి ఎలా వెళ్తున్నానో తెలియదు... ఏదో నాలుగు గింజలు ఉడకె య్యడం, గదిలోకెళ్లి తలుపేసుకోవడం దిన చర్యగా మారిపోయింది." అన్నాడు లోలోన కుమిలిపోతూ.

విషయం విని మూడురోజుల తర్వాత మల బద్ధకాన్ని వదిలించుకున్న వాడిలా దీర్ఘంగా శ్వాస విడిచాడు మల్లేశం. కాసేపటి తర్వాత "ఇంతకీ ఏమేమి చేస్తుందో చెప్పనేలేదు..." అన్నాడు మల్లేశం.

గట్టుతెగిన గోదారిలా గొల్లుమన్నాడు రామేశం.




కాసేపటి తర్వాత "ఒకటా రెండా.. ఎన్నని చెప్పను. ఇదివర కంటే గుండెజబ్బో, కేన్సరో ప్రమాదకరమైన జబ్బులని చెప్పుకునేవాళ్లు. ఇప్పుడీ టిక్ టాక్ అన్నింటికంటే ప్రమాద కరంగా అందరికీ అంటుకున్న అంటువ్యాధిలా మారిపోయింది. జుట్టువిరబోసుకుని, తెల్లచీర కట్టుకుని ఇల్లదిరిపోయేలా గజ్జెలేసుకుని 'నిను వీడని నీడను నేనే' అంటూ హడలెత్తించింది... గుండె బ్రిటిషు కాలంనాటి బ్రిడ్జిలా గట్టిది కాబట్టి సరిపోయింది. లేకపోతే ఈపాటికి నా బతుకు కాటికి చేరేది. అది మర్చిపోదామని ఊపిరి పీల్చుకునేసరికి ఇంకో ఉపద్రవం ముంచుకొచ్చింది. 'గోవుల్లు తెల్లన గోపెమ్మ నల్లన' అనే పాటకి వీడియో చేయడానికి గేదెల దగ్గరికి తీసుకెళ్లమంది. ఈ మహానగరంలో వాటిని వెతికేసరికి తాతలు దిగొచ్చారు. పోనీ అందని వాటికి అర్రులు చాచడమెందుకు, అందుబాటులో ఉన్నవాటిని వాడుకుని సర్దుకు పోమంటే పూనకం వచ్చినట్లు ఊగిపోతుంది.




'అందరూ చేసినట్లు మనమూ చేస్తే గొప్పే ముందీ?' అని దీర్ఘాలు పోతుంది. కొన్న చీర లన్నీ అయిపోయాయి. కొత్తవి కొనాలి. ఒక రోజు చీర, తర్వాత రోజు పంజాబీ డ్రస్సు, ఇంకోరోజు నా పిండాకూడు! రోజుకో అవ తారం, పూటకో కొత్తపాట. డబ్బులన్నీ కాస్ట్యూ మ్సుకి కావలసినవాటిని కొనడానికి ఎడారిలో కురిసే వానలాగా ఇంకిపోతున్నాయి.

పోనీలో ముచ్చటపడుతుంది కదా... భరిద్దాం అనుకుంటే మొన్నటికి మొన్న పసి పిల్లలమీదా ఆడవాళ్ల మీదా జరుగుతున్న అత్యాచారాల్ని పేపర్లో చదివి 'ఈ దుర్యోధన దుశ్శాసన దుర్వినీతి లోకంలో...' అంటూ వీడియో చేసింది. కామెంట్స్ బాక్స్ చూసి కుళ్లి కుళ్లి ఏడుస్తుంది. లైకులు రాలేదని కేకలేస్తుంది. సెకనుకో గండం, నిముషానికో మరణం' అన్న ట్లుంది నా బతుకు" ఆగాడు రామేశం.

కాళ్ళూచేతులూ కూడదీసుకునే దీర్ఘరోగిలా పెనుగులాడాడు మల్లేశం. 'ఎదురింటామె తొడ కోసుకుంటే నేను మెడ కోసుకుంటానన్నట్లు'గా




తయారయింది మీ చెల్లాయి పరిస్థితి. ఒకరిని చూసి ఒకరు... ఏదో తాపత్రయం! వీళ్లలో దాగున్న విపరీతమైన ప్రతిభను లోకానికి తేట తెల్లం చేయాలని బొక్కబోర్లా పడుతున్నారు. కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్నాయన్న బెంగ లేదు, సంబంధాలు మంటగలుస్తున్నాయన్న బాధలేదు. ఒకటే గోల... టిక్ టాక్!

దీనికి టిట్ ఫర్ టాట్... ఎత్తుకు పైయెత్తు ఎలా వేయాలో ఆలోచించసాగాడు మల్లేశం.

చెక్కెర వెతికేవాడికి తేనె దొరికినట్లుగా మల్లేశం బుర్రలో ఆలోచన తళుక్కున మెరిసింది. గొంతులో నుండి అప్రయత్నంగా 'హిప్ హిప్ హుర్రే' లాంటి విపరీత ధ్వనులు వెలువడి కామేశాన్ని ఒకింత కంగారుకు గురిచేశాయి.

'ఏమయింద్రా...' అని అడుగుతున్న కామేశాన్ని 'ఆగమన్నట్లు'గా సైగచేసి దగ్గరకొచ్చి చెవిలో ఏదో చెప్పాడు.

విషయం విన్న కామేశం కట్లు తెంచుకున్న ఏనుగు ఒక్కసారిగా దూకినట్లుగా దుప్పటి ముసుగు తీసి ఎగిరి గంతేశాడు.


ఆపైన మల్లేశాన్ని పైకెత్తి గాల్లో గిరగిరా తిప్పాడు. సమస్య పరిష్కారం అయ్యేటట్లుగా అనిపించడంతో 'జాగ్రత్త' అని చెప్పి బయల్దేరాడు మల్లేశం.

స్నేహితుడు వెళ్లాక క్షణం కూడా ఆలస్యం చేయకుండా మిత్రుడి ఆలోచనను ఆచరణలో పెట్టాడు కామేశం.

గదితలుపులు తీసుకుని భార్య బయటికి వచ్చే సమయానికి గుమ్మమెదురుగా మూర్ఛ రోగిలా పడి కొట్టుకో సాగాడు.

ఏదో లోకంలో ఉన్నట్లుగా నడుస్తున్న ఆమె ఒక్కసారిగా ఆ దృశ్యంచూసి కెవ్వున కేకేసి 'ఏమైందండీ' అంటూ భర్తను సమీపించింది.

"నాకేమైంది... నేను బాగానే ఉన్నానే! ఊరికే... టిక్ టాక్ వీడియో తీద్దామని ఇలా ప్రయత్నిస్తున్నాను. ఒక్కసారి అక్కడికెళ్లి సరిగా రికార్డ్ అయిందో లేదో చూడు... లేదంటే మళ్లీ తీస్తాను" అంటున్న భర్త తలమీద గట్టిగా మొట్టి– "ఏదో జోకులో పాటలో తీయాలి గానీ ఇలాంటి వీడియోలు కూడా చేస్తారా? ఖర్మ..." అంటూ విసవిసా నడిచి వెళ్తున్న భార్య వంక చూసి గుప్తనిధి దొరికినవాడిలా గుండెలనిండా నవ్వుకున్నాడు కామేశం.




సాయంత్రం హాల్లో కూర్చుని టీ తాగసాగారు భార్యాభర్తలిద్దరూ.


టీ ఒక సిప్ చేసిన కామేశం– "కఆకహా! కటీ కఎంకత కమకధుకరంకగాకఉంకది! కఅకద్భుకత:'' అన్నాడు అటూఇటూ తిరుగుతూ.

కామేశం వంక అయోమయంగానూ... ఆదుర్దాగానూ చూసిన భార్య కాసేపటి తర్వాత "ఇదెక్కడి భాషండీ! నేనెపుడూ వినలేదే!" అంది పది లంఖణాలు చేసినట్లుగా ముఖంపెట్టి.

"దీన్ని 'క'భాష అంటారులే! ఇదొక్కటే అనుకున్నావా? నాకు 'జ'భాష,'డ'భాష.. ఆ మాట కొస్తే వర్ణమాలలో ఉన్న ప్రతి అక్షరాన్ని ముందుపెట్టి మాట్లాడగలను. ఏదో చిన్నప్పుడు ఆకతాయిగా నేర్చుకున్నది ఇలా టిక్ టాక్ కోసం ఉపయోగపడుతుందని కలలో కూడా అనుకోలేదు. ఇది అర్థం కాక వీడియో చూసిన వాడు బుర్ర గోడకేసి బాదుకోవాలి.." అంటూ 'జ'భాష ఉపయోగించి ఇంకో వీడియో తీయడంలో నిమగ్నమయ్యాడు.

అడిగింది ఇవ్వలేదని ఏడుపు లంకించుకున్న పిల్లాడి పరిస్థితిలా ఉంది ఆమె పరిస్థితి.

తను వీడియోలు తీసినంత కాలం పరిస్థితి










ఎలా ఉందో అంచనా వేయలేకపోయింది... మనం చూస్తున్న వ్యక్తుల తీరు ఇలా ఉంటే మనం చేసిన వీడియోలు చూస్తున్న వాళ్లు ఎలా ఉంటారో? అనుకోగానేగుండె ఝల్లుమంది ఒక్కసారిగా.

సాలెగూడుగా ఉన్నప్పుడు లోపలికి ప్రవే శించి సంకెళ్లుగా మారిన తర్వాత తెంచుకుని బయటికి రాలేని పరిస్థితిలో తనుంది.

జరిగినవి పూర్తిగా జీర్ణం కాకముందే... ఇలాంటి మరో సంఘటన జరిగింది.

బయట వాన కురుస్తుందని బట్టలన్నీ లోపల వేసి వంటింట్లో పని చేసుకోసాగింది.

కాసేపటికి హాల్లోనుండి వచ్చిన గావుకేక విని అదిరిపడి పరిగెత్తుకొచ్చింది.

తన చీర చుట్టుకుని వాకిట్లోకి పరిగెడుతున్న భర్తను చూసి ఖంగుతింది.

భర్త ఫోనులోనుండి 'ఆడవాళ్లంటే చులకనా మీకు? మీకు జన్మనిచ్చింది ఆడది, లాల పోసింది, బువ్వపెట్టింది, మీ ప్రతి అవసరాన్ని తీర్చింది ఆడదేనని మర్చిపోయారా? అటువంటి ఆడదాన్ని ఇలా కుండపోత వానలో ఏకాకిగా నిలబెడతారా?" అంటూ వినిపించడంతో కంగారు పడిపోయింది.

ఆ మాటలకు అనుగుణంగా హావభావాలు ప్రదర్శిస్తున్న కామేశాన్ని చూసి గుటకలు మింగింది.

నవ్వాలో... ఏడవాలో... తెలియని సంకట స్థితిలోకొట్టుమిట్టాడింది.

బలవంతంగా చేయి పట్టుకుని లోపలికి తీసుకొచ్చింది.

తువ్వాలుతో భర్త తల తుడుస్తూ–

"ఇవేమి తిక్కపనులండీ?... వర్షాన్ని లెక్క చేయకుండా ఆ పాడు వీడియోలు తీసి ఎవర్ని ఉద్ధరించాలట?" అంది.

"మరి నువ్వెవర్ని ఉద్ధరిస్తున్నావట!..." అన్నాడు.


ముఖంమీద తువ్వాలు విసిరేసి లోపలి కెళ్లింది.

✦✦✦

"మొత్తంమీద నువ్విచ్చిన ఐడియా నాకు భలే పనికొచ్చిందిరా!... నీకెలా కృతజ్ఞతలు చెప్పాలో తెలియట్లేదు!" అన్నాడు రామేశం.

మిత్రుడి వంక చూసి ముప్పైరెండు పళ్లూ కనిపించేటట్లు నవ్వి– "ఇప్పుడెలా ఉంది పరిస్థితి?" అన్నాడు మల్లేశం

"పనున్నప్పుడు మాట్లాడడానికి తప్ప ఫోన్ అసలు వాడట్లేదు... ఇంతక్రితం మాటకు ముందు 'వీడియోలు తీయాలి, వీడియోలు తీయాలి... తొందరగా తెమలండీ...' అని కంగారు పెట్టే ఆవిడ ఇప్పుడు మాత్రం 'పుస్తకం చదువుకోవాలి... తొందరగా తెమలండీ' అని హడావిడి చేస్తోంది. అయినా క్షవరం అయితే గానీ వివరం రాదు కదా! పనులు మానుకుని పనికిరాని వీడియోలు తీసే ఆవిడ పుస్తకాల పురుగులా మారిపోయింది. ఇదంతా నీవిచ్చిన 'టిక్ టాక్... టిట్ ఫర్ టాట్' ఆలోచన వల్లనే!" అన్నాడు మల్లేశాన్ని కౌగిలించుకుంటూ.



# తర్కారావు కథలు



గంగాధర్ వడ్లమన్నాటి-9908445969

## ఆ అనుభవం కొంత పనికొచ్చింది

**తర్కారావు ప్రింటింగు ప్రెస్సు ఓనరు. జీతం పెంచమని అతని కింద పనిచేసే సుబ్బారావు ఎప్పుడొచ్చినా... అతనికి ఓ కథ చెప్పి... దాని ముగింపు చెప్తే జీతం పెంచుతానంటుంటాడు. ఇప్పుడు కూడా ఓ కథ చెప్పడం ప్రారంభించడంతో... సుబ్బారావు వినసాగాడు-**

**ఆ** మధ్యాహ్నమే తమ పక్కింటిలోకి అద్దెకి వచ్చిన లలితతో మాట్లాడుతోంది పంకజాక్షి.

"ఏంటి! అన్నయ్యగారు ఏం చేస్తున్నారు లోపల?" అడిగిందామె.

"సామాన్లు సర్దుతున్నారు. ఇప్పటివరకూ నేనూ సాయం చేసాను. ఇక నన్ను రెస్ట్ తీసుకోమన్నారు. ఒక్కరే వద్దండీ అని నెత్తి కొట్టుకు మొత్తుకున్నా, మెత్తగా కోప్పడినా, మత్తెక్కిన మనిషిలా పట్టించుకోలేదు. నాకు సాయం చేస్తేనే ఆయన మనసుకి హాయట!" చెప్పింది లలిత సిగ్గుతో తన జుత్తు సుతారంగా వేళ్ళతో పీకేసుకుంటూ.

"సామాను సర్దుడికే అంత శబ్దాలు వస్తున్నాయా!?" బుగ్గలు నొక్కుకుంది పంకజాక్షి.

"ఒక్క సామాను సర్దడమే కాదు... నేను ఇందాక తోమిన అంట్లు కూడా సర్దుతున్నారు. బట్టలు కూడా వాషింగ్ మెషీన్‌లో వేస్తున్నారు" చెప్పింది లలిత ఇంకాస్త జుత్తుని మునివేళ్ళతో పీకేసుకుని...మరికాస్త గర్వంతో ఉబ్బిపోతూ.

"అలాగా! బావుంది! మా వారూ ఉన్నారు... ఉప్పు డబ్బా అందుకోమంటే చాలు... మాడు చిప్ప మొహం పెట్టుకుని, కప్పలా ఎగిరెగిరి పడతారు. ఎప్పుడూ దెప్పిపొడుపులే తప్ప కప్పు కాఫీ పెట్టి సిప్పు చేయమన్న పాపాన పోలేదు." అని పంకజాక్షి రుసరుసలాడుతుండగానే కరెంటు పోయింది.

ఒక్కసారిగా చిమ్మచీకటి అయిపోయింది. అయినా సరే లోన శబ్దాలు ఆగలేదు.



లోపల్నుండి లలిత భర్త బయటికి రాలేదు.

దాంతో పంకజాక్షి ఆశ్చర్యంగా-

"అదేవిటి లలితా! కరెంటు పోయింది. పైగా రాత్రి పూట, అలా చిన్న వెలుతురులో కూడా అలా ఎలా పనిచేసేస్తున్నారు మీ వారు?" అడిగిందామె.

"అదా!...అది మీకు కొత్త కానీ మాకు అలవాటైపోయింది. అది ఆయనికి మామూలే. చిమ్మ చీకటిలో చిన్న క్యాండిల్ లైట్‌లోనో, సెల్ వెలుతురులోనో అన్ని పనులూ చక్కగా, చురుగ్గా, సరిగ్గా, చేసేస్తారు.... ఎందుకంటే ఆయన ఆ ఉద్యోగం చేస్తున్నారు కదా! అందుకే ఆయన అలా చిన్న వెలుతురులో కూడా చక్కగా అన్ని పనులూ చక్కబెట్టేస్తారు మరి!" చెప్పిందామె.

అలా ఆమె చెప్పగానే, లోపల్నుండి వస్తువుల శబ్దాలతో పాటు లలిత భర్త పళ్ళు పటపటా కొరికిన శబ్ధం కూడా చాలా స్పష్టంగా విన్పించింది పంకజాక్షికి.

"ఇప్పుడు చెప్పు సుబ్బారావ్! అసలు ఆమె అన్నట్టు ఆయన చేస్తున్న ఉద్యోగం ఏమై ఉంటుందీ? నువ్వు దగ్గరగా చెప్పినా నీ జీతం పెంచేస్తాను" చెప్పాడు తర్కారావ్

"ఏవుంది సార్! ఆయనికి రేచీకటేమో! దాంతో ఆయనికి అన్ని పనులూ చేయడం అలా అలవాటైపోయింటుంది. అంతేనా సార్!" అడిగాడు సుబ్బారావు.

"నీ తెలివి తెల్లారినట్టే ఉంది! రేచీకటి అయితే అసలు కళ్ళే కనబడవు కదా! నా ప్రశ్న అతని ఉద్యోగం ఏవిటీ అని? కనుక నువ్వు చెప్పింది సరైన జవాబు కాదు. అతను సినిమా హాల్లో చిన్న టార్చ్ పట్టుకుని టికెట్ నెంబర్లు చూసే ఉద్యోగం చేస్తున్నాడు. ఆ అనుభవం ఇలా పనికొస్తోందిపుడు అంటూ తెగ మురిసిపోతూ చెప్పుకొచ్చిందామె... అదీ అసలు సంగతి. నువ్వు చెప్పలేక పోయావు కనుక ఈ సారి కూడా నీ జీతం పెంచడం జరగదు" అని తర్కారావు చెప్పగానే-

"మీ తర్కం మీదే కానీ నా తరపు అర్ధం చేసుకోరు కదా!" అనుకుంటూ అక్కడ్నుంచి వెళ్ళిపోయాడు సుబ్బారావు.

వేదనాగ ఫౌండేషన్ ఉగాది హాస్యకథల పోటీలో ప్రత్యేక బహుమతి పొందిన కథ

# తానూ ఈజ్ ది బెస్ట్!








డాక్టర్ ఎమ్.సుగుణరావు, 9704677930


**ఆముదాలవలస, ఆండాళమ్మ కళాశాల 1977-1979 రెండేళ్ళు ఇంటర్ చదివిన విద్యార్థులంతా ఒక సమూహంగా ఏర్ప డ్డారు. ఒక వాట్సాప్ సమూహాన్ని ఏర్పరచు కున్నారు.**

**వాళ్ళందరికీ ఇంకా అరవయ్యేళ్ళు నిండ లేదు. దగ్గరగా ఉన్నారు. కొంతమందికి రెండేళ్ళు, కొంతమందికి రెండునెలలు... ఇంకొంతమందికి కొన్ని రోజులలో అర వయ్యవ పడిలో పడతారు.**

అయినా 'ఇప్పటికింకా మా వయసు ఇంకా పదహారే' అని పాడుకుంటూ యూత్‌గా భ్రమిస్తారు.

వాళ్ళంతా కలిసి వైజాగ్‌లో గెట్ టుగెదర్ పెట్టు కోవడానికి బయలుదేరారు.


హైదరాబాద్‌లో ఉండే వెంకటేశ్వర్లు, జయ ప్రకాష్, రాంబాబు గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో బయలు దేరారు. వారితో దుబాయ్ నుంచి వచ్చిన శ్రీనివాస్ కలిసాడు. అతడిని స్నేహితులంతా దుబాయ్ శ్రీనుగా పిలుస్తారు. మనమూ అలాగే పిలుద్దాము.

వారితో రాజమండ్రిలో వెంకటరమణ ఇంకా తదితర మిత్రులు కలుస్తారు. అంతా వైజాగ్‌లో దిగి వైజాగ్‌లో ఒక మల్టీ నేషనల్ ఫైనాన్స్ కంపెనీకి జోనల్ మేనేజర్‌గా ఉన్న హనుమాన్లు ఆఫీసుకు వెళతారు. ఆ రోజు హనుమాన్లు ఆఫీసులో అతని పుట్టినరోజు వేడుకలు జరుపుతారు.

అది స్థూలంగా వారి కార్యక్రమం.

హైదరాబాద్‌లో అంతా సెకండ్ ఏ.సి. కంపార్ట్ మెంట్ ఎక్కారు.




ఎక్కుతున్న వారికి స్వాగతం పలుకుతూ దుబాయ్ శ్రీను గుమ్మం ముందే నించుని వెల్ కమ్ డ్రింక్ అందించాడు. అలా స్వాగతం పలుకుతూ అందరి నోళ్ళలోనూ తీర్థం పోసాడు (మద్యపానం ఆరోగ్యానికి హానికరం. చట్టబద్ధ మైన హెచ్చరిక.)

అలా ట్రెయిన్ కదిలే టైమ్‌కు మిత్రులంతా తమ సీట్లను అలంకరించారు. ఇంతలో ఆ కంపార్ట్‌మెంట్‌లోని 'సూప్, టమాటా సూప్, వేడి వేడి టమాటా సూప్' అంటూ ఒక వెండర్ అరుస్తూ వచ్చాడు.

వారికెదురుగా ఒక పెద్దమనిషి సూటు, టైలో ఉన్నాడు. చాలా గంభీరంగా ఎవరితోనూ మాట్లాడకుండా కూర్చున్నాడు. అతను ఆ సూప్ అబ్బాయిని పిలిచి ఒక సూప్ ఇవ్వమని డబ్బులు ఇచ్చాడు.

వెంటనే జయప్రకాష్, "ఈ టమాటా సూప్ ఎలా తయారుచేస్తారో తెలుసా?" అన్నాడు, మిత్రులను ఉద్దేశించి.

"తెలీదు." అన్నారు ముక్తకంఠంతో.

"ఐతే వినండి... ఇది తెలుసుకోవాల్సిన విషయం." అంటూ చెప్పడం మొదలుపెట్టాడు.

"మీకు రైతుబజార్‌లు తెలుసు కదా! అక్కడ అమ్మకానికి టమాటాలు చెక్కపెట్టెల్లో వస్తాయి" అని చెప్పడం ఆపాడు క్షణంసేపు.

ఎదురుగా ఉన్న పెద్దాయన టమాటా సూప్ తాగడం మొదలుపెట్టాడు. వేడిగా ఉండడంతో కొద్ది కొద్దిగా తాగుతున్నాడు.

మళ్లీ జయప్రకాష్ చెప్పడం మొదలు పెట్టాడు.




"చెక్కపెట్టెల్లో నలిగిపోయిన, కమిలిపోయిన పళ్ళను కుప్పగా పోస్తారు. వీటిలో మంచివి ఏరుకుని వెళ్లిపోయిన తర్వాత మిగిలిన పళ్ళను తీసుకెళ్లి పెద్ద పెద్ద పాత్రలలో వేసి, దాంట్లో నీళ్ళు, మసాలా, ఉప్పు వేసి, గంటల తరబడి కాస్తారు... అలా సూప్ తయారవుతుంది." అన్నాడు జయప్రకాష్.

"మరి చాలా రుచికరంగా ఉంటుంది కదా!" అన్నాడు రాంబాబు.

"కారణం–నాన్‌వెజ్...అది చేరుతుంది కదా! ఇలా బాగా నలిగిన, మగ్గిన పళ్ళల్లో." అన్నాడు జయప్రకాష్ వివరంగా.

అంతే! ఆ మాటలకు తను తాగుతున్న సూప్ కక్కేసి, గబగబా బాత్‌రూమ్‌కు పరిగెట్టాడు ఆ పెద్దాయన.

ఆయన వచ్చిన తర్వాత జయప్రకాష్ అన్నాడు.

"సారీ సార్! సరదాగా టైమ్ పాస్ కోసం మా మిత్రులకు చెప్పాను. వైజాగ్ వరకు మాకు గడవాలి కదా! ఇది నా స్వంత రచన. ఎవరినీ ఉద్దేశించి చెప్పింది కాదు. నేను చెప్పినట్టు సూప్ తయారీ కాదు. మేలైన టమాటాలతోనే తయారవుతుంది" అన్నాడు రెండు చేతులు జోడించి.

"మరైతే ఆ ముక్క ముందే ఏడవొచ్చుగా." అన్నాడాయన కోపంగా. తన బట్టల మీద ఒలికిన సూప్ తుడుచుకుంటూ.

"సారీ!" మరోసారి అన్నాడు జయప్రకాష్.

ఆయన ముభావంగా కూర్చున్నాడు.

ఇంతలో 'సమోసా...సమోసా... వేడి వేడి

సమోసా' అంటూ మరో వెండర్ అరుస్తూ వచ్చాడు.

క్షణం క్రితం సూప్ తాగి, కక్కుకున్న పెద్దా యన "సమోసాలు నాలుగు ఇవ్వు" అంటూ కోటు జేబులోంచి డబ్బులు తీసి ఇచ్చాడు.

వెంటనే జయప్రకాష్ "అబ్బాయిలూ! సమో సాలు ఎలా చేస్తారో తెలుసా?!" అన్నాడు మిత్రులను ఉద్దేశించి.

అంతే, ఆ ఉత్తరక్షణంలో ఆ పెద్దాయన ఆ సమోసాల పొట్లంతో ఆ కంపార్ట్‌మెంట్ నుంచి నిష్క్రమించాడు.


"ఒరేయ్ తప్పు కదా!" ఆ పెద్దాయనను రేగింగ్ చేస్తావా?" అన్నారు మిత్రులు, జయ ప్రకాష్‌తో.

"రేగింగ్ ఆయనే చెయ్యబోయాడు. గమనిం చారా? మనం ఏం తింటున్నా అదో రకంగా చూడడం మొదలుపెట్టాడు. నేను తెచ్చుకున్న పెరుగన్నం, మామిడిపండు జుర్రుకుని తిం టుంటే అదోరకంగా చూసాడు. ఛీ... అన్నట్టు. అందుకే ఈ రేగింగ్. మనిషిని బట్టే బాబూ!" అన్నాడు జయప్రకాష్.

మిత్రులంతా నవ్వుకున్నారు.

వెంటనే జయప్రకాష్, "ఒరేయ్ అరవైలో ఇరవై వయసున్న అబ్బాయిలూ! మనం షష్ఠి పూర్తికి దగ్గరవుతున్నాము. ఇంతకీ ఏం వెనకే సారో చెప్పండి?!" అన్నాడు.

"అరేయ్! నేను కచ్చితంగా నాలుగు రాళ్ళు




వెనకేసుకున్నాను." అన్నాడు రాంబాబు.

"ఓహో! అర్థమైంది." అన్నారందరూ చిన్నగా నవ్వి.

"నాకు ఏకంగా షుగర్ ఫ్యాక్టరీ ఉంది" అన్నాడు వెంకటేశ్వర్లు.

"నాకు మాత్రం తక్కువా, ఒక గ్యాస్ కంపెనీ ఓనర్‌ని" అన్నాడు దుబాయ్ శీను.

"అర్థమైందిరా!... నేనేం తక్కువ తిన్నానా? అన్నీ తిన్నాను. భూచరాలు, జలచరాలు, ఆకాశచరాలూ. అందుకే నాకు ఒక కొవ్వు కర్మాగారమే వుంది." అన్నాడు జయప్రకాష్.

అలా కబుర్లతోనే వారి ప్రయాణం సాగింది.

రాజమండ్రిలో మిగిలిన మిత్రులు కలిసారు. గోదావరి ఎక్స్‌ప్రెస్ తరువాతి రోజు ఉదయం ఆరు గంటలకు వైజాగ్ చేరుకుంది.

ట్రయిన్ దిగగానే వారు, మిత్రుడు హను మాన్లుకు ఫోన్ చేసారు.

'మేం రిఫ్రెష్ అయి, మధ్యాహ్నానికల్లా నీ ఆఫీస్‌కు వస్తాము. అక్కడే నీ పుట్టినరోజు వేడుకలు. ఆ తర్వాత గెట్ టగెదర్" అన్నారు మిత్రులు హనుమాన్‌కు ఫోన్ చేసి.

అలాగే అన్నాడు హనుమాన్లు.

✦✦✦

ఉదయం పదయ్యింది.

ఆముదాలవలస మిత్రులు కలవబోతున్న హనుమాన్లు ఆఫీసులోకి నడుద్దాం. ఆ ఆఫీ సుకు కొత్తగా వచ్చాడు జోనల్ మేనేజర్‌గా హనుమాన్లు.

'ఈ బాస్‌తో 'శభాష్' అనిపించుకోలేము' అనుకున్నారు. ఆ ఆఫీసువారు అతగాడు ఆఫీ సులో చార్జి తీసుకోగానే.

''నా ముందా మీ కుప్పిగంతులు!'' అంటాడు. దానినిబట్టి అర్థమవుతుంది. అతడి పేరు హనుమాన్లు అని. ఆయన పేరు తెలి యనివారికి కూడా-అయితే ఆంజనేయ స్వామికి ఈయనకు దేనిలోనూ పోలిక లేదు అనుకుంటారు. అతడి గురించి తెలిసినవాళ్ళు.

ఆంజనేయుడు, మర్యాద పురుషోత్తముడు, స్వామి భక్తి పరాయణుడు, వినయ సంప



న్నుడు. అందుకు హనుమాన్లు పూర్తిగా వ్యతిరేకం. నోరు విప్పితే అమర్యాద, అహంకారం, కారం, సురేకారం కలిపి దట్టించినట్లుంటాడు. అందుకు నిదర్శనం ఇప్పుడు జరగబోతున్న ఘటన.

హనుమాన్లు ఆఫీసులోకి రాగానే కాసేపు ధ్యానంలోకి వెళతాడు.

ఒక పావుగంట వరకూ బాంబులు పడినా కళ్ళు తెరవడు. ఆ రోజు ఆయన ధ్యానంలో కూర్చున్న సమయంలో బైట కలకలం రేగింది.


ఒక కస్టమరు ఆఫీసు సీనియర్ అసిస్టెంట్ రామయ్యతో గొడవ పడుతున్నాడు... పెద్ద గొంతుకతో అరుస్తున్నాడు. ఆ గొడవ పావు గంట దాకా సాగింది. అప్పుడు ధ్యానంలోంచి లేచిన హనుమాన్లు తన కేబిన్‌లోంచి బైటకొచ్చి చూసేసరికి గొడవపడిన కస్టమరు లేడు.

ధ్యానంలోంచి ప్రశాంతంగా రావలసిన హనుమాన్లు రౌద్రంగా, ఆవేశంగా బైటకొచ్చాడు. రాగానే కళ్లెర్రజేసి చూసాడు. సీనియర్ అసిస్టెంట్ బి.రామయ్య వంక.

రామయ్య ఆయన వంక కళ్ళు అప్పగించి చూస్తున్నాడే గాని ఏ మాటా మాట్లాడడంలేదు.

"ఏమయ్యా! రామయ్యా!! కస్టమర్‌తో ఎందుకు గొడవ?! మనం వారిని ఎలా చూడాలి? దేవుడిలాగా చూడాలన్నారు కదా గాంధీగారూ!" అన్నాడు హనుమాన్లు కోపంగా.

ఆ మాటలకు రామయ్య బదులు చెప్పలేదు.




"ఏమయ్యా రామయ్యా! అలా మౌనం వహిస్తావేం? మీ పేరు అడిగితే బి. రామయ్య అన్న మాట నిజం కాదు. బి. రామయ్య అంటే బెల్లం కొట్టిన రామయ్య అంటారా" అన్నాడు తను వేసిన జోకుకు తానే నవ్వుతూ.

ఆఫీసులో అంతా నవ్వారు.

బాస్ జోకేస్తే నవ్వాలి కాబట్టి రామయ్య మాత్రం తలొంచుకున్నాడు.

హనుమాన్లుకు కోపం ఆగడంలేదు.

"ఏమిటీ చెప్పడానికి సంకోచిస్తున్నావా? భయమా? లేక సిగ్గా? లేక వినయమా!?" అన్నాడు.

"భయంతో కూడిన సిగ్గు వల్ల వచ్చిన వినయం" అన్నారెవరో మెల్లగా.

బాస్ అంతగా రెట్టిస్తున్నా రామయ్య నోరు మెదపలేదు.

ఇంతలో ఆ సీన్‌లోకి ఒక అబ్బాయి ఎంటరయ్యాడు. వాడికి పదేళ్ళుంటాయి.

"నేను చెబుతా ఆ కస్టమర్ ఏమన్నాడో?!" అన్నాడు గట్టిగా.

అంతా ఆశ్చర్యంగా ఆ పిల్లవాడి వంక చూసారు.


"చెప్పరా! మీ తాత చెప్పలేకపోయాడు. నువ్ చెప్పరా!! తాతలు దిగొచ్చారు అంటారు. దానికి వ్యతిరేకంగా మనవడు దిగొచ్చాడు. తాతను రక్షించడానికి" అంటూ హనుమాన్లు గట్టిగా నవ్వుతూ ఆ కుర్రవాడి వంక చూసాడు.

అందరికీ అర్థమయింది... ఆ పిల్లవాడు రామయ్యగారి మనవడని, తాతయ్యతో పాటూ ఆఫీసుకొచ్చాడనీ.

రామయ్య ఏదో చెప్పబోయేంతలో... ఆ కుర్రాడు గబగబా చెప్పడం మొదలెట్టాడు.

"ఆ కేబిన్‌లో కూర్చున్న మీ జోనల్ మేనేజర్ అలా నిద్దరోతున్నాడే కూర్చునే, బైటకు రాడా? కస్టమర్ల సమస్యలు పట్టవా?... ఇక్కడ ఫేన్లు సరిగా తిరగడం లేదు. ఆయన మాత్రం ఏసి రూములో కులుకుతున్నాడు. అడ్డగాడిద... అప్రాచ్యుడు... మూర్ఖుడు!"

అంతే! ఆ ప్రదేశంలో ఒక విస్ఫోటనం.



వెంటనే హనుమాన్లు అక్కడ నుంచి మాయ మయ్యాడు. తన గదిలో ప్రత్యక్షమయ్యాడు. వెంటనే బెల్ మోగింది.

రామయ్యను ఆయన లోపలకు పిలిచాడు.

రామయ్య వణుకుతూ హనుమాన్లు ముందు నిలబడ్డాడు. ఒక కస్టమరు అలా హనుమాన్లు గారిని తిట్టినట్టు తను ఎలా చెప్పగలడు?! అందుకే తను ఆయన చెప్పినట్లు బెల్లం కొట్టిన రాయిలా అయిపోయాడు.

మధ్యలో తన మనవడు వచ్చి తనను రక్షిం చాడా నిజం చెప్పి.....లేక ఇంకో పెద్ద శిక్ష వేయించబోతున్నాడా?!

వెంటనే హనుమాన్లు అడిగాడు.

"మీకు సిడిఏ రూల్స్ గురించి తెలుసా?!"

"తెలుసు సార్, శీలం, క్రమశిక్షణ, నియమా వళి!" అన్నాడు భయం భయంగా రామయ్య.

"ఈ మూడు సూత్రాలను అనుసరించి నేను మీపై ఎందుకు చర్య తీసుకోకూడదు. ఒక అన్యుడు నాపై దుర్భాషలు ఆడుతూంటే అక్కడ కూడా బెల్లం కొట్టిన రాయి అయిపోయి, నేను ఆ విషయం అడిగితే, తిరిగి శిలాప్రతిమలా అయిపోయి, ఆఖరికి వేలెడంత లేని మీ మన వడి ద్వారా కూడా నన్ను నలుగురిలో నగు బాటు చేయిస్తావా... వీటన్నిటి మీద మీపై చర్య ఎందుకు తీసుకోకూడదు? వెంటనే లెటర్ రాయవయ్య. మీపై షోకాజు నోటీస్." అన్నాడు హనుమాన్లు కోపంగా.




అలా తనకు ఇవ్వవలసిన సంజాయిషీ, పత్రం తనే టైప్ చేసుకోవలసిన దుస్థితి ఏర్పడి నందుకు రామయ్య దుఃఖిస్తూ, ఆ ఉత్తరం టైప్ చేసి, ఆయన చేతుల మీదుగా ఆ శ్రీముఖం స్వీకరించి, అక్కడనుంచి కదిలాడు.

ఇది హనుమాన్లు వ్యక్తిత్వానికి ఒక మచ్చు తునక. అతను ఆఫీసుకు వచ్చిన ఆ వారం రోజుల్లోనూ ఉద్యోగులకు చుక్కలు చూపిస్తు న్నాడు. రోజూ ఎవరో ఒకరు అతడి కోపానికి బలవుతున్నారు.

అయితే హనుమాన్లు పుట్టినరోజు ఆ రోజు అని ఆ ఆఫీసులో అందరికీ తెలుసు. కారణం ఫేస్‌బుక్ ద్వారా అందరికీ ఆ విషయం తెలి సింది. అయినా ఎవ్వరూ అతడికి జన్మదిన శుభాకాంక్షలు చెప్పలేదు. కారణం.....అతడికి శుభాకాంక్షలు చెప్పే మూడ్ ఎవరికీ లేదు. అతనికి ఎదురుపడడం, మాట్లాడడం ఒక ప్రమాదంగా భావిస్తూ వచ్చారు.

ఐతే, ఆ రోజు హనుమాన్లు మిత్రులు తమ ఆఫీసులోనే పుట్టినరోజు జరుపబోతున్నారనీ, వారి రాకతో తమ జీవితంలో ఒక మార్పు రాబోతోందనీ కూడా వారికి తెలీదు.

అలా ఆ మధ్యాహ్నం పూట, ఒక ఉద్యోగికి సంజాయిషీ పత్రం ఇచ్చిన సంతోషంలో తలమునకలై ఉన్న హనుమాన్లు కేబిన్‌లోకి తన 1977-79 ఇంటర్ మిత్రులంతా వచ్చారు.

అతడికి ఆనందం రెట్టింపు అయ్యింది.


కారణం వాళ్ళంతా పెద్ద కేకు, బొకేతో అతడి వద్దకు వచ్చారు. జయప్రకాష్, ఆ ఆఫీసు ఉద్యో గుల్ని ప్రతీ ఒక్కరినీ కలిసాడు.


అందరినీ పరిచయం చేసుకున్నాడు.

"మీ బాస్‌గారి పుట్టినరోజు... కేక్ కట్ చేద్దాం. మీరంతా ఉత్సాహంగా పాల్గొనాలి." అన్నాడు.

వారి నుంచి ఏ స్పందనా లేదు. కనీసం హనుమాన్లకు 'హేపీ బర్త్‌డే సార్' అని చెప్పిన వారూ లేరు.

"ఇదేదో విచిత్రమైన పరిస్థితి. పగవాడికీ ఈ దుర్దశ ఉండకూడదు." అనుకున్నాడు.






ఆ ఆఫీసర్ హెచ్.ఆర్. డిపార్ట్‌మెంట్ అందరికీ ఆహ్వానం పంపారు.

'సాయంత్రం హనుమాన్లు, జోనల్ మేనేజర్ గారి పుట్టినరోజు సందర్భంగా మన సిండికేట్ రూమ్‌లో అల్పాహారం, కేక్‌కటింగ్ కార్యక్రమం అని'.

లంచ్ సమయంలో హనుమాన్లు మిత్రుల్ని తీసుకుని ఒక నక్షత్రాల హోటల్‌లో భోజనానికి వెళ్లాడు. తీరికగా భోజనం చేసి, కబుర్లాడుకుని వచ్చేసరికి ఆఫీసు టైమ్ అయిపోయింది.

ఆ ఆఫీసు ఐదు గంటలకే మూసేస్తారు.

హనుమాన్లు మిత్రులతో కలసి సిండికేట్ రూమ్‌లోకి ప్రవేశించాడు.

అందరికీ షాక్ తగిలేలా అక్కడి దృశ్యం.


ఆ రూములో ఏ ఒక్క ఉద్యోగీ లేదు. అంతా ఇళ్ళకు వెళ్లిపోయారు. హనుమాన్లు మిత్రులు, కోయవలసిన కేకు ఇంకా ఉద్యోగుల నిమిత్తం తీసుకొచ్చిన అల్పాహారం పాకెట్లు మిగిలాయి. ఆఫీసు మూయడానికి వచ్చిన సెక్యూరిటీ మాత్రం ఉన్నాడు. అతనూ ఔట్‌సోర్సింగ్.

అయితే పుట్టినరోజు జరుపుకోబోయే హనుమాన్లు మొహం వెలవెలబోయింది. తన చిన్ననాటి స్నేహితుల దగ్గర తన గొప్పలు చెబుదామనుకుని అందర్నీ పిలిచేడు. కానీ, తనే అవమానం పాలయ్యానని హతాశుడయ్యాడు.

హనుమాన్లు స్నేహితులకు, ఆ రోజు మధ్యాహ్నామే విషయం చూచాయగా అర్థమైంది. ఇప్పుడు ఆఫీసు ఉద్యోగులు గైరు హాజరులో పూర్తిగా సీను అవగతమైంది.

వెంటనే దుబాయ్ శీను అన్నాడు– "మా కందరికీ ఏదో వ్యసనాలున్నాయి. వీటివలన మా ఆరోగ్యాలు పాడవుతాయి. కానీ నీ వ్యసనం అహంకారం... అది నీ చుట్టూన్న వారిని నీ నుంచి దూరం చేస్తుంది. అది చాలా ప్రమాదకరమైన అనారోగ్యం. దాన్నే 'మానవత్వపు స్పర్శ లేకపోవడం' అంటారు. ఇంత పెద్ద పదవిలో ఉండి కూడా ఏ ఒక్కరి అభిమానాన్ని పొందలేకపోవడం దౌర్భాగ్యం!" అన్నాడు.

ఆ తర్వాత జయప్రకాష్ నోరు విప్పాడు.




"ఉదయం మేము టమాటా సూప్ గురించి జోక్ వేసుకున్నాము. తాజా పళ్లయినా, నిలవ పళ్ళయినా, టమాటా సూప్ వేడిగా తాగినపుడే బావుంటుంది. అలా నీకు పడిన వేడి, వాడి అయిన దెబ్బ మీద ఉన్నప్పుడే నీ డెసిషన్ తీసుకో! జీవితం వేడి టమాట సూప్ రుచిలా మార్చుకో!.. ఈ పుట్టినరోజునాడు నువ్ ఎందుకు పుట్టావో తెలుసుకో!" అన్నాడు.

మిత్రుల మాటలతో హనుమాన్లు మరింత కృంగిపోయాడు. అతను బూట్లు వేసుకునేటప్పుడు తప్ప ఎప్పుడూ వంగడు... ఎవరికీ లొంగడు. తనే ఎవరికైనా క్లాసులు పీకాలి తప్ప తనకు ఎవరైనా క్లాసులు పీకితే సహించలేడు. పీకింది స్నేహితులే కాబట్టి భరించాడు.

ఇక తరువాతి రోజు నుంచి జరిగింది చరిత్రే!

హనుమాన్లు సార్థక నామధేయుడయ్యాడు.

ఆంజనేయస్వామి పేరు పెట్టుకున్నందుకు తన అరవయ్యవ సంవత్సరంలో జ్ఞానసంపన్నుడయ్యాడు... సంస్కారంగా ఉండడం... వినయంగా మాట్లాడం నేర్చుకున్నాడు.

నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుంది. మాటే మంత్రమవుతుంది... వాక్కు ఆభరణమవుతుంది.

అలా హనుమాన్లు వాళ్ల ఇంట్లోనూ, బంధుకోటిలోనూ, ఆ ఆఫీసులోనూ 'హనూ ఈజ్ ది బెస్ట్' అనిపించుకున్నాడు.

**వేదనాగ ఫౌండేషన్ ఉగాది హాస్యకథల పోటీలో ప్రత్యేక బహుమతి పొందిన కథ**

# బంపర్ ఆఫర్






మణి వడ్లమాని, 9652067891

**"ఏమండీ! పండక్కి చీర కొనుక్కుంటాను. షాపింగ్‌కి వెళదాము రండి!!" అని గోముగా అడిగింది రాణి.**

**ఆ రోజున ఏ కళనున్నాడో రాజా వెంటనే– "సరే వెళదాము." అన్నాడు.**

**"ఇదిగో ఇప్పుడే కాఫీ తెస్తాను!" అంటూ క్షణంలో కాఫీ కప్పుతో ప్రత్యక్షమైంది.**

**ఎప్పుడూ కూడా అడిగితే కానీ కాఫీ ఇవ్వని శ్రీమతి ఇవాళ షాపింగ్‌కి వెళ్ళడం కోసం వెంటనే ఇచ్చేసింది అని పళ్ళు నూరుకున్నాడు లోలోపలే.**

"సరే! ఎక్కడికి వెళ్ళడం?... ఎన్ని చీరలు కొంటావు?..." అని అడిగాడు


"బజార్లో కొత్తగా ఒక పెద్ద షో రూం పెట్టారు మొన్నే. అక్కడకు వెళ్దాము. Inaugral offer ట – ముందు మనం కొంత డబ్బు కడితే. వెంటనే మనపేరు రిజిస్టర్ చేస్తారు. అలా మొదటే రిజిస్టర్ చేసుకున్నవాళ్ళకి ముందు మూడురోజులలోనే ఇలా చీరలు కొనే అవకాశం ఉంది తెలుసా? ఇది ఓపెనింగ్ ఆఫర్ ట. అందుకని అప్పుడే ఇవాళ మూడోరోజు, అందుకే ఈ తొందర, పక్క ఫ్లాట్ పావని అప్పుడే నాలుగు చీరలు తెచ్చుకుందట. వెంటనే నా పేరు కూడా రిజిస్టర్ చేసేసాను." అని ఉత్సాహంగా చెప్పింది.

"యేమిటి ముందు నామినాల్ అమౌంట్ తో రిజిస్టర్ చేస్తే చీరలు ఫ్రీగా ఇస్తాడా?... అసలు ఇది నమ్మొచ్చా?...లేకపోతే ఏ కొట్టు చీకుడు గుడ్డలో ఇస్తాడా? నాకయితే అస్సలు నమ్మకం లేదు. అసలు మీ లాంటి వాళ్ళు ఉండబట్టే ఇలాంటి మోసాలు నడుస్తున్నాయి." అన్నాడు

"అబ్బ !శుభం పలకరా! అంటే ఏదో అన్నట్లు, మిమల్ని రమ్మన మన్నాను చూడండి!"

"సరే పద! పద!! అసలే ట్రాఫిక్ ఎలా ఉంటుందో తెలుసు కదా? అందులోను పండగ సీజనాయే..."

✦✦✦




మొత్తానికి ఒక గంట కష్టపడి ఆ షాప్ దగ్గరకి చేరుకున్నారు.

అక్కడ ఇసుకవేస్తే రాలనంత జనం ఉన్నారు. 'వీళ్ళకి ఇంట్లో పనులేమి ఉండవా? అందరూ ఇలా బజారున పడ్డారు' అని గొణుక్కున్నాడు రాజా

"అబ్బ! ఇంత జనంలో ఏం వెళతాము... ఇంటికి పోదాం పద!" అన్నాడు విసుగ్గా.

"అబ్బబ్బ! కాస్త జనం కనిపిస్తే చాలు విసుక్కుంటారు. వచ్చే వాళ్ళు వస్తారు, వెళ్ళేవాళ్ళు వెళ్లిపోతుంటారు... అలా నిలబడిపోతారా ఏంటి? అయినా చూస్తున్నాను మీ వరస" అని ముక్కు చీదసాగింది.

"ఏయి రాణి! ఇక్కడ కుళాయి విప్పకు తల్లీ నీ ఇష్టం వచ్చినట్లు చేసుకో నేను మటుకు లోపలి రాను. ఒక పని చెయ్యి నీ సెల్ ఫోన్ ఉంది కదా! చీరలు కొనడం అవగానే ఫోన్ చెయ్యి" అన్నాడు.

"సరే!..." అని లోపలి ఉత్సాహంగా వెళ్ళిపోయింది రాణి.

బయటే నిలబడి జనాలని చూసి చూసి విసుగొచ్చేసింది. అక్కడకి రెండు మూడు సార్లు ఫోన్ చేసాడు... అబ్బే రాణి అసలు ఫోన్ చూస్తేనా? చీరలు ఏరుకోవడంలో బిజీగా ఉంది.

ఈ లోపల స్నేహితుడు మురారి కనిపించాడు.

"ఏంటి కొంపతీసి నువ్వు కూడా నాలా భార్యా షాపింగ్ బాధితుడివా?!"

"అది కొంప తీయకుండానేలే... అయినా రాజా నీకు ఇక్కడ జోకులు ఎలా వెయ్య బుద్ధి అవుతోంది నాకు ఒళ్ళు మండిపోతోంది!"




"హాహా! ఇక తప్పకపోతే నవ్వుతూ ఆస్వాదించడమే.. అన్నారు కదా పెద్దలు... ఆ విధంగా మదీయ రాజావారు." అంటూ తన గుండెల మీద వేలుతో పొడుచుకుంటూ... "చస్తానా! రాక! నీకు తెలియని మర్మము కాదుగా హితుడా!!"

"భలే చెప్పావు గురూ! అసలు ఇలా ఆఫర్లు పెట్టేవాళ్ళని బాన్ చేయాలి!"

"ఇంకా నయం! ఆ మాట గట్టిగా అనకు. నిన్ను, నన్ను చీల్చి చెండాడేస్తారు!"

దాదాపు రెండు గంటల నిరీక్షణ తరువాత ఎలాగో కష్టపడి జనాలని తప్పించుకుంటూ షాప్ నుంచి బయట పడింది రాణి.

వెంటనే రాజాకి ఫోన్ చేసింది.

ఫోన్ మాట్లాడేసిన రాజా– "ఓయి! మురారి నాకు విముక్తి లభించింది. మా ఆవిడ బయటకు వచ్చేస్తోంది." అన్నాడు.

"నా కంత అదృష్టం ఎప్పుడు వస్తుందో!" అంటూ తిరణాలలా ఉన్న షాప్ లోపలికి తొంగి చూస్తూ అన్నాడు మురారి.

ఈ లోపల రాణి వచ్చి "ఏమండీ!" అని పిలిచింది.

అమ్మయ్య! ఇప్పటికి తెమిలావా తల్లి... అన్నట్లు గుర్రుగా చూసాడు.

ఏదో పెద్ద ఘనకార్యం చేసిన దానిలా, వెయ్యికాండిల్‌బల్బ్ కాంతులతో రాణి మొహం వెలిగిపోతోంది.

"సిస్టర్! మా ఆవిడ నాకు ఎప్పుడు విముక్తి కలిగిస్తిందో నీకేమన్నా ఐడియా ఉందా?" రాణిని పలకరించాడు మురారి.

"అయ్యో! తెలియదు అన్నయగారు! అక్కడ

వదినగారుతో పాటు వాళ్ళ స్నేహితులు ఇంకా చాలామంది కొంటున్నారు" అంది.

"ఇంకేమి గ్యారంటీగా ఇంకో రెండు మూడు గంటలు పడుతుంది." అని ఒక వెర్రి నవ్వు నవ్వాడు మురారి.

✦✦✦

మొత్తానికి చీరలు కొన్నామన్న గర్వంలో ఉంది రాణి.


ఇంటికొచ్చాక పాకెట్లు విప్పి... భర్తకి చూపిస్తూ మనసులో ఇలా అనుకుంది...

'ఎలాగు పండగ వస్తోంది, ఆడపడచులకి, వదినలకి అక్క చెల్లెళ్లకి గొప్పగా పట్టు చీరలు కొన్నట్లు ఉంటుంది... పైగా పండగకి పట్టు చీరలు పెట్టింది అన్న క్రెడిట్ కూడా సంపాదించుకోవచ్చు. మొత్తం అరడజను చీరలు కొంది. అంటే పెట్టుబడి తక్కువతో ఖరీదైన చీరలు వచ్చాయి.' అని ఆనందంగా అనుకో సాగింది.

అందరూ 'ఏమైనా మా రాణి సెలక్షన్‌కి వంక పెట్టనవసరంలేదు.' అని అభినందిస్తూన్నట్లు ఊహించుకోసాగింది.

ఇంతలో "ఇది చూడు!... ఏమన్నా కొత్త డిజైనా?" అడిగాడు... ఒక చీర మీద ఉన్న తూట్లని చూపిస్తూ.

"అయ్యో! అది డిజైన్ కాదండి చిల్లులు! ఏది చూడనీయండి..." అంటూ చీర మొత్తము




విప్పి చూసింది.

చీర అంతా అలాగే ఉంది.

"మిగతా చీరలు ఎలా ఉన్నాయో చూడు!" అన్నాడు రాజా.

"అన్నీ చీరలు మొత్తం విప్పి చూసింది.

చీరలన్నీ కూడా డిఫెక్ట్‌వే. కొన్నింటికి color fade అయి ఉంది, కొన్నింటికి చిరుగులు, ఒక చీర అయితే అసలు పాత దానిలా ముడుచుకు పోయి ఉంది.

"మరి నువ్వు చూసుకోలేదా అక్కడ!" అని విసుకున్నాడు రాజా

"అంటే... వాడు అక్కడ అన్ని రాసులుగా పోసాడు, అందులోంచి ఏరుకున్నాను, కాని అప్పుడు ఏం కనిపించలేదు" అని చిన్నబోయిన గొంతుతో చెప్పింది.

"ఏవండీ! పోనీ ఒక్కసారి షాప్‌కి వెళ్దాం!" అంది.

"తప్పుతుందా! పద!!" అన్నాడు.

పరిగెత్తుకుంటూ షాప్‌కి వెళ్ళారు.

తీరా అక్కడికి వెళ్లేసరికి షాప్‌వాళ్ళు చెప్పింది విని కళ్ళు తిరిగినంతపని అయ్యింది.

వాళ్ళు అన్నదేమిటంటే ఒకసారి కొన్న వస్తువులు తిరిగి తీసుకోనబడవు అని!

"అది మీరు ముందు చెప్పలేదు కదండీ!" అంటే...

"లేదండి మేము చెప్పాము! అదిగో బోర్డు కూడా అక్కడే ఉంది" అని చూపించారు.


ఇక చేసేది లేక వెనక్కి వచ్చేసారు.

రాణి మొహం చూస్తుంటే రాజాకి నవ్వొస్తోంది. ఎలాగో బిగ పెట్టుకొని కూచున్నాడు.

ఇంట్లోకి వెళ్ళిన వెంటనే తెరలు తెరలుగా నవ్వడం మొదలెట్టాడు.

"ఎందుకు అంత నవ్వు!?" ఉక్రోషంగా అంది రాణి.

"లేకపోతే... ఏంటి జానకి! ఎవరు మొదట రిజిస్టర్ చేస్తే వాళ్ళకి తక్కువ డబ్బుతో ఎక్కువ



ఖరీదు చీరలు ఇస్తాడంటే నమ్మేయడమేనా?"

"ఏమండీ వాడి మీద కేసు వేద్దామా?

"వేయచ్చు!... కాని వాడు ఏం చెప్పాడో చూసావా? 'నేను ముందే చెప్పాను ఏదైనా డిఫెక్టు ఉంటే ఇక్కడే చూసుకోవాలి– అని కదా' అన్నాడు కదా! అది మన తప్పు, రెండోది ఇలాంటి ఆఫర్లు ఎప్పుడూ మోసమే...

వాళ్ళు, సరుకు అమ్ముడు పోవడానికి ఏవేవో చేస్తూ ఉంటారు. అవన్నీ నమ్మి మనమే మోస పోతాం. అందుకు ఏమి చెయ్యాలి అంటే కొనే వాళ్ళు కొంచెము వివేకంతో అలోచించి అత్యాశకు పోకుండా ఉంటే ఇలాంటివి జరగవు.

చదువుకున్న నువ్వే పక్కఫ్లాట్ పావని కొనుక్కొంది అని వెళ్లి పోయావు తప్ప, అంత ఖరీదు చీరలని వాడు లాభం వదులుకొని ఎందుకు ఇస్తాడు అని ఆలోచించలేదు. అదే నువ్వు ఒక్కసారి ఆలోచించి ఉంటే, నీ డబ్బులు దక్కేవి... పైగా డబ్బులు ఎవరికి ఊరికే రావని ఆ నగలషాప్ ఆయన చెబుతూనే ఉన్నాడు. నువ్వే వినలేదు."

"అది కాదండి!... ఎంత సరదాపడ్డాను పండగ షాపింగ్ అని. అలాంటిది ఘోరంగా మోసపోయాను కదా అని బాధేసింది....

కొంతసేపు ఆగి...

"ఇంకానయం! ఒక్కరూపాయకే చీర అన్న లైన్‌లో నించోలేదు. పెద్ద గొడవ... ఇంచు మించుగా లాఠీచార్జ్ అయినంత పని జరిగింది." అన్నది రాణి బాధగా.

"పోనీలే ఇప్పుడు తెలిసింది కదా! అందుకే ఇంకోసారి ఇలాంటివి జరగక్కుండా జాగ్రత్త పడు, పండగకి వేరే షాప్‌కెళ్ళి కొందాములే!" అని దిగాలుగా ఉన్న రాణికి చెప్పాడు రాజా.

ఇంతలో టీవీ లో ఏదో పెద్దగా వినిపిస్తుంటే అటువైపు చూసింది.

'బంపర్ ఆఫర్... మా ప్రోడక్ట్ కొంటే ఉచితంగా మీరు విదేశాలకి వెళ్ళచ్చు' అన్న ప్రకటన విని టీవీ బద్దలుకొట్టేంత కోపంతో చూసి టీవీ స్విచ్ఆఫ్ చేసేసింది రాణి.

వెళదామా అన్నట్లు చూసి... పకపకా నవ్వ సాగాడు రాజా.

## మానసికోల్లాసం కోసం...




**హా**బీ! మానసికోల్లాసం కోసం ఒకోక్కరు ఒకో హాబీని ఎంచుకుంటారు... ఒకరు కార్టూనింగ్ అయితే మరోకరు కథలు రాయడం, ఇంకొకరు పాటలు వినడం, మరొకరు స్టాంపుల కలక్షన్స్... ఇలా చాలామంది చాలా రకాల హాబీలతో వారి వారి ఖాళీ సమయాన్ని సద్వినియోగం చేస్తుంటారు.

గుంటూరులో 5వ తరగతి చదువుతున్న చిన్నారి **పన్నాల గాయత్రి** తన ఏడేళ్ళ వయసు నుండే నాణేల సేకరణ చేస్తూ ఇప్పటికీ చాలా రకాల, పురాతనమైన నాణాలను సేకరించింది.

చిన్నప్పుడే ఏర్పడిన ఆసక్తిని తల్లి దండ్రులు శ్రీమతి సంధ్యారాణి, శ్రీ చంద్రశేఖరఫణిగార్లు గ్రహించి, ఎంతో ప్రోత్సాహించటం వలన పాతకాలపు రూపాయి బిళ్ళలు, విదేశీ నాణాలు, డాలర్లు సుమారు 500 దాకా సేకరించింది.

ఈ క్రమంలో తను చదువుతున్న స్కూల్‌లో ఉపాధ్యాయురాలు లీలావతిగారు స్కూలులో ఇతర పిల్లల దగ్గరున్న నాణేలు కూడా సేకరించి ఇచ్చి ఎంతగానో ప్రోత్సహించడం చిన్నారి గాయత్రి నాణాల సేకరణ మరింత సులభతరమైంది.

ఈ హాబీను మరింత ఉత్సాహంగా కొనసాగించాలని హాస్యానందం కోరుకుంటోంది.



వేదనాగ ఫౌండేషన్ ఉగాది హాస్యకథల పోటీలో
ప్రత్యేక బహుమతి పొందిన కథ

# సైకాలజిస్ట్




ఇంద్రగంటి నరసింహమూర్తి, 9959352900




**"ఒరేయ్ బ్రహ్మీ! ... పాతికేళ్లు దాటాయి. చక్కగా పెళ్లి చేసుకో... నీ పెళ్లి చూసి తృప్తిగా కన్నుమూస్తాను." సలహా ఇచ్చిన బామ్మ మాటలకు బ్రహ్మానందం సిగ్గు పడ్డాడు.**

**అత్తగారు తృప్తిగా కన్నుమూస్తారన్న మాటలు కర్ణపేయంగా వినిపించాయి కోడలు సూర్యకాంతానికి.**

**"ఈవిడగారికి చాకిరీ చేయలేక ఛస్తున్నాను. బ్రహ్మిగాడికి పెళ్లయితే అటు అత్తగారికి చాకిరీ తప్పుతుంది. ఇటు కోడలికి వంటిల్లు అప్పచెప్పి హాయిగా టీవీ సీరియల్స్ చూసుకోవచ్చు." అనుకుంటూ ...**


**"ఏమండోయ్! ... మీ అమ్మగారి కోరిక తీరుద్దాం. వెంటనే సంబంధాలు చూడండి. మన బ్రహ్మిగాడి పెళ్ళి చేసేద్దాం!" భర్తతో చెప్పింది సూర్యకాంతం.**

"నాకూ పెళ్లి చేద్దామనే ఉంది. కాని కోడలొచ్చాక నువ్వా కోడలు కొట్టుకు ఛస్తుంటే సర్దలేక నేను చావాలి. ఇంతవరకు నీకూ మా అమ్మకి రోజూ వచ్చే గొడవలకే నా బుర్ర బొప్పికట్టింది. ఇద్దరు అత్తలు, ఇద్దరు కోడళ్ళతో వచ్చే గొడవలతో ఇల్లు రణ రంగం అవుతుందన్న భయంతోనే ఇంతవరకు వాడి పెళ్లి ఊసెత్త లేదు." తన అభిప్రాయం చెప్పాడు సత్యానందం.

"మీ అమ్మగారు వేసే నిందలు తట్టుకుంటూ... రాచి రంపాన పెడుతున్నా ఓర్చుకుంటూ, అత్తగారికి సేవలు చేస్తూంటే, నన్ను సపోర్ట్ చేయకుండా, అత్తాకోడళ్ళ మధ్య గొడవలంటారా... తల్లి పోలికలు పుణికిపుచ్చుకున్నారు. మగవాడనిపించుకున్నారు..." ఖంగుమంది సూర్యకాంతం కంఠం.

"ఏమిటి బోడి! నువ్వు చేసే సేవ! నువ్వే నన్ను నానా మాటలూ అంటూ నేను రాచి రంపాన పెడుతున్నానంటావా... " మాటకు మాట పెంచింది బామ్మ.

అత్తా కోడళ్ళు కాస్సేపు ఒకరిపై ఒకరు మాటలు విసురుకుని




అలసిపోయి టివి సీరియల్స్ చూడడంలో ముని గారు.

కాసేపు మౌనం తరువాత– "ఈ పూట కూరేం చేశావ్?..." అడిగింది బామ్మ.

"బంగాళాదుంపల వేపుడు ... వేడి వేడిగా తినండి" అంటూ కుర్చీలోంచి లేచింది కోడలు.

పోట్లాడుకున్న కొద్దిసేపటికి మామూలుగా మాట్లాడుకోవడం వారికలవాటే.

✦✦✦

బ్రహ్మానందం ఎమ్.ఎ. సైకాలజీ చేశాడు. మనస్తత్వ శాస్త్రాన్ని ఔపోసన పట్టానని గర్వంగా చెప్పుకుంటాడు. పది నిముషాలు మాట్లాడి ఎదుటి వ్యక్తి మైండ్ చదివేయగలనని ఢంకా బజాయిస్తాడు.

ప్రయివేటు కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తూ, సాయంత్రం కాలేజీ నుండి రాగానే తన కౌన్సిలింగ్ సెంటర్‌లో బాధతప్త హృదయులకు కౌన్సిలింగ్ చేస్తాడు.

చదువులో వెనకబడిన విద్యార్థులకు చదువుపై ఆసక్తి కలిగిస్తాడు. ఆత్మహత్య చేసుకోవాలనుకుంటున్న వారికి జీవితంపై ఆశ కల్పిస్తాడు... ప్రతిరోజు కనీసం ఐదారుగురు సెంటర్‌కు వస్తారు. వాళ్ల దగ్గర వసూలు చేసే ఫీజులు బ్రహ్మానందానికి అదనపు ఆదాయం.

అమ్మ, బామ్మల మధ్య సఖ్యత కుదర్చలేక పోతున్న తండ్రికి కౌన్సిలింగ్ చేయాలని చాలా సార్లు అనుకున్నాడు. ఆడవాళ్ల మనసును అర్థంచేసుకోవడం వారిని పుట్టించిన బ్రహ్మకే సాధ్యంకాదని వాదిస్తాడు సత్యానందం.

తండ్రి వాదన తప్పని రుజవు చేస్తానని శపథం చేశాడు బ్రహ్మానందం.

✦✦✦

బామ్మ ప్రేరణతో సత్యానందం దంపతులు సుపుత్రుడికి పెళ్లిచేయాలని సంకల్పించారు.

అమ్మాయిల్ని సెలక్ట్ చేశారు.

ఒక అమ్మాయి పేరు సరస్వతి. తెలుగు ఎమ్.ఎ. చేసింది. రెండో అమ్మాయి స్వరాజ్య లక్ష్మి. ఇద్దరమ్మాయిల బయోడేటాలు పరిశీలించి బ్రహ్మానందం సంతృప్తిచెందాడు.

"ఇద్దరినీ చూద్దాం. పెళ్లిచూపులలో ఇద్దరితో అయిదు నిముషాలు మాట్లాడానంటే వారి మనస్తత్వాలు ఇట్టే పట్టేస్తాను. మన ఇంటికి రాబోయే కోడలు అత్తమామలను గౌరవించాలి. భర్తను ప్రేమించాలి. శాంత స్వభావురాలు కావాలి.... ఇంటిపనంతా ఒంటిచేత్తో చేయగలగాలి. ఆ ఇద్దరిలో మన ఇంటి మహాలక్ష్మిని చిటికలో సెలెక్ట్ చేస్తాను. సరియైన నిర్ణయం తీసుకునే పూచీ నాది. మీరు చూస్తూ ఉండండి..." గర్వంగా ఛాతీ విరుచుకుని చెప్పాడు బ్రహ్మానందం.


✦✦✦

మొదటగా సరస్వతిని చూడడానికి సత్యానందం కుటుంబ సభ్యులు బయలుదేరారు.

పరిచయాలు, ఫలహారాలయ్యాక సరస్వతి వచ్చి, కుర్చీలో కూర్చుంది.

చీర కట్టులో హుందాగా వస్తుందనుకున్న పెళ్లికూతురు పంజాబీడ్రెస్సులో వచ్చి బ్రహ్మానందం అంచనాలను తలక్రిందులు చేసింది. డ్రెస్‌కోడ్ పాటించనందుకు మైనస్ మార్కులిచ్చాడు బ్రహ్మానందం.

'సరస్వతి అందమైనదే" అనుకుంటూ ఆమె మనస్తత్వాన్ని అంచనా వేసే పనిలో పడిపోయాడు.



సూర్యకాంతం వేసిన ప్రశ్నలకు చకచకా సమాధానాలిచ్చింది పెళ్ళికూతురు.


ఏమాత్రం సిగ్గు ప్రదర్శించని పెళ్ళికూతుర్ని అహంభావి అని భావించాడు పెళ్ళికొడుకు.

బ్రహ్మానందం అడిగిన ప్రశ్నలకు తడుము కోకుండా తగిన సమాధానాలిచ్చింది సరస్వతి.

గలగలా మాట్లాడేస్తున్న సరస్వతిని ఆశ్చర్యం గా చూశాడు బ్రహ్మానందం.

'అహంకారి, వాగుడుకాయ... భర్తను లక్ష్య పెట్టదు. అత్తమామలను గౌరవించదు. ఇంట్లో ఎవరినీ మాట్లాడనీయదు.

అమ్మో ! ఈమెతో వేగడం కష్టం. మాటల్తో జయించలేం. సరస్వతి మనస్తత్వాన్ని ఆకళింపు చేసుకున్నాడు బ్రహ్మానందం.




✦✦✦

మరోవారం తరువాత సత్యానందం కుటుంబం స్వరాజ్యలక్ష్మిని చూడడానికి బయలు దేరింది.

పెళ్ళికూతురు తల్లిదండ్రులు మర్యాదలు ఘనంగా చేశారు.

యథావిధిగా ఫలహారాలు, తేనీరు సేవించాక, పట్టుచీర కట్టుకుని హుందాగా నడచి వచ్చి, అందరికీ నమస్కరించి, కుర్చీలో ఆసీను రాలయింది పెళ్లికూతురు.


"మా అమ్మాయికి మహాసిగ్గు... బుద్ధిమంతు రాలు... ఎక్కువగా మాట్లాడదు..." సర్టిఫై చేసింది స్వరాజ్యలక్ష్మి తల్లి.

'అమ్మాయి ముఖం కళగా ఉంది!' అను కుంటూ సంబరపడ్డాడు బ్రహ్మానందం.

సూర్యకాంతం అడిగిన ప్రశ్నలకు ఒకటి రెండు మాటలతో ముద్దు ముద్దుగా సమాధాన మిచ్చింది స్వరాజ్యలక్ష్మి.

బ్రహ్మానందం మరికొన్ని ప్రశ్నలడిగి సమా ధానాలు రాబట్టాడు.

"ఎంత వినయం... ఎంత విధేయత! బిటెక్ చదివినా టెక్కు లేదు. ముఖంలో అమాయ కత్వం ప్రస్ఫుటిస్తోంది. భర్తను ప్రేమిస్తుంది. ఇంట్లో మాట బయటకు వినపడదు. అమ్మాయి ల్లో మణిపూస" స్వరాజ్యలక్ష్మి మనస్తత్వాన్ని




అంచనా వేశాడు సైకాలజిస్ట్ బ్రహ్మానందం.

స్వరాజ్యలక్ష్మి తల్లిదండ్రులు పెళ్ళిచూపుల కార్యక్రమం జరుగుతున్నంత సేపూ కూర్చో కుండా చేతులు కట్టుకు నిలబడడం బ్రహ్మా నందానికి ఆనందాన్నిచ్చింది.

'మంచి కుటుంబం... ఆదర్శవంతమైన కుటుంబం. అనురాగాలు పంచే కుటుంబం. స్వరాజ్యలక్ష్మి నాకోసమే పుట్టింది... ఐ లైక్ హర్! " అన్నాడు బ్రహ్మానందం ఇంటికి వచ్చాక.

✦✦✦

మరో రెండు నెలల తరువాత స్వరాజ్యలక్ష్మి, బ్రహ్మానందంల వివాహం ఘనంగా జరిగింది.

కొత్త కోడలు కాపురానికి వచ్చింది.

స్వరాజ్యలక్ష్మి దినచర్యకు బ్రహ్మానందం బిత్తరపోయాడు.

స్వరాజ్యలక్ష్మి ఉదయం తొమ్మిది గంటల కల్లా నిద్ర లేస్తుంది. ఆమె లేచేసరికి పొగలు కక్కుతున్న ఫిల్టర్ కాఫీ ఆమె బెడ్ ప్రక్కన ఉండాలి.

"లేస్తూనే కాఫీ త్రాగకపోతే నాకు పిచ్చెక్కి నట్లుంటుంది. లేవగానే కాఫీ పడకపోతే నేనేం చేస్తానో నాకే తెలీదు" అంటూ మొదటిరోజే వార్నింగిచ్చింది కొత్తకోడలు.

అత్తగారు భయపడుతూ– "అలాగే నమ్మా!" అనక తప్పలేదు.

కాఫీ త్రాగుతూ వాట్సాప్‌లో అరవై మందికి

శుభోదయం సందేశాలు పంపి బాత్‌రూమ్‌కి వెళుతుంది. స్నానం చేసి వచ్చేసరికి బ్రేక్‌ఫాస్ట్ రెడీగా ఉండాలి. బ్రేక్‌ఫాస్ట్ తరువాత లాప్‌టాప్... ఫేస్‌బుక్‌లో లైకులు కొట్టడం... మెసేజ్‌లు ఫార్వర్డ్ చేయడం... క్షణం ఖాళీ ఉండదు స్వరాజ్యలక్ష్మికి.

"మా ఇంట్లో మా అమ్మ కాలు కింద పెట్టనిచ్చేది కాదు" అంటూ వయ్యారాలు పోతున్న కోడలి ప్రతాపానికి సూర్యకాంతం మనసు మండసాగింది.

ఫలితం...

కాలేజీ నుండి రాగానే స్వరాజ్యలక్ష్మిపై సూర్యకాంతం కొడుకుకి ఫిర్యాదు చేస్తుంది. స్వరాజ్యలక్ష్మి అత్తగారిపై భర్తకు చాడీలు చెపుతుంది. ఎటూ చెప్పలేక దిక్కులు చూడడం బ్రహ్మానందం అలవాటు చేసుకున్నాడు.

సత్యానందానికి కాస్త రిలీఫ్ దొరికింది. బామ్మ ముచ్చట తీరింది.

'కొత్తకోడలు అత్తగారికి చుక్కలు చూపిస్తోంది. వాళ్లిద్దరి గొడవ నాకు చూడ ముచ్చట' అనుకుంటూ బామ్మ సంబరపడసాగింది.

తల్లా!... పెళ్ళామా!... తేల్చుకోలేకపోయిన బ్రహ్మానందం అప్పుడప్పుడు తల గోడకేసి కొట్టుకోవడం... జుట్టు పీక్కోవడం ... గోళ్ళు కొరుక్కోవడం... అలవాటు చేసుకున్నాడు.

'తల్లికీ పెళ్లానికీ సఖ్యత కుదర్చడం కన్నా కాశ్మీర్ సమస్య పరిష్కరించడం చాలా సులువు!' అని బ్రహ్మానందం గొణుక్కుంటున్నాడు.

✦✦✦

ఆదివారం సాయంత్రం డిమార్ట్‌మాల్‌కు వెళ్లాడు బ్రహ్మానందం.

చిరకాల మిత్రుడు గోపీకృష్ణ కనిపించి విష్ చేశాడు. మిత్రులిద్దరూ సంవత్సరం తరువాత కలుసుకోవడంతో కాస్సేపు యోగక్షేమాలు విచారించుకున్నారు.

"నాకు నాలుగు నెలల క్రితం వివాహమయింది. అదుగో నా భార్య." అంటూ సరుకులు ట్రాలీలో వేస్తున్న భార్యని చూపించాడు గోపీకృష్ణ.

అటువైపు దృష్టి సారించిన బ్రహ్మానందం అవాక్కయ్యాడు.

గోపీకృష్ణ భార్య తను తిరస్కరించిన సరస్వతి.

'గోపీకృష్ణా! భలే ఉచ్చులో పడ్డావు...' అనుకుంటూ... "ఎలా వుంది కొత్త సంసారం?" నవ్వుతూ అడిగాడు బ్రహ్మానందం.




"నేను చాలా అదృష్టవంతుడినిరా బ్రహ్మం!... నా సరస్వతిది చాల మంచి మనసు. గలగలా మాట్లాడే బోళామనిషి... నన్ను ఎంతగానో ప్రేమిస్తుంది. శాంత స్వభావురాలు. తను ఇంట్లో అడుగు పెట్టినవేళ నాకు ప్రమోషన్ వచ్చింది. మా అమ్మ నాన్నలు కోడలి మంచితనానికి మురిసిపోతున్నారు. ఒక్క మాటలో మా ఇంటి మహలక్ష్మి సరస్వతి." సంతోషంగా చెప్పసాగాడు గోపీకృష్ణ.


"మళ్లీ కలుద్దాం! వస్తా!" అంటూ సరకులతో ఉన్న ట్రాలీని అక్కడే వదిలేసి బయటకొచ్చి, జుట్టు పీక్కుని, వెర్రిచూపులు చూడసాగాడు బ్రహ్మానందం... ది సైకాలజిస్ట్.



వేదనాగ ఫౌండేషన్ ఉగాది హాస్యకథల పోటీలో
ప్రత్యేక బహుమతి పొందిన కథ

# పరోపకార్ ప్రజాసేవ





రాజేష్ యాళ్ళ, 9700467675


**'ఈయన మళ్ళీ ఏదో కొంప ముంచినట్టున్నారు' అనుకుంటూ గబగబా వీధిగుమ్మంలోకి వచ్చింది పావని.**

**"ఏమయిందండీ?!" భర్తను, అక్కడున్న ఓ పదిహేడేళ్ళ కుర్రాడినీ మార్చి మార్చి చూస్తూ అడిగింది.**

**"ఏమీ లేదు. నువ్వేమీ గాభరా పడిపోకు. మరో అరగంట కల్లా మీ నాన్న మిలట్రీమనిషిలా చకచకా నడిచేస్తాడు." ఆ కుర్రాడికి వెళ్ళమన్నట్టుగా తల ఊపుతూ చెప్పాడు పరోపకార్.**

"మీరాగండి...అసలేమయిందమ్మా?!" ఆ కుర్రాడినే అడిగింది పావని.

"నాన్నగారు నడుం నొప్పితో బాధ పడుతున్నారండీ. నిన్న సాయంత్రం అంకుల్ ఏదో టాబ్లెట్ వేసుకొమ్మని చెప్పారట. రాత్రి అన్నం తిని అది వేసుకుని పడుకున్నారు. ఉదయం నుంచి మంచం మీదనుండి లేవలేకపోతున్నారాంటీ!" దిగాలుగా చెప్పాడా అబ్బాయి.

"అయ్యో! నడుం నొప్పి తగ్గలేదా?!"

"లేదాంటీ! అంకుల్‌కి ఫోన్ చేస్తే అదే తగ్గిపోతుందిలే అన్నారు."

"ఓ పని చెయ్యమ్మా! డాక్టర్‌ని పిలవండి. అంకుల్ చెప్పిన మాత్ర పని చేసి ఉండకపోవచ్చు."

"అవునాంటీ! ఈ పని ముందే చేసి ఉండవలసింది." కోపంగా పరోపకార్ వైపు చూస్తూ అన్నాడా కుర్రాడు.

"నేను కూడా నా నడుం నొప్పి వచ్చినప్పుడల్లా అదే వాడుతున్నా అబ్బాయ్!" నసిగాడు పరోపకార్.

"మీరు వాడితే ఆయనకీ అదే పని చెయ్యాలని లేదు కదా... నువ్వు త్వరగా డాక్టర్ని పిల్చుకుని వెళ్ళు బాబూ." ఆ కుర్రాడికి చెప్పింది పావని.

విసుగ్గా ప్రభాకర్‌ను చూస్తూ విసురుగా వెళ్ళిపోయాడా కుర్రాడు.

"నలభయ్యేళ్ళు వయసొచ్చింది కానీ మీ బుద్ధి మాత్రం ఏమైపోతుందో నాకర్థం కావడంలేదు!" కోపంగా చెప్పింది పావని.

"ఇప్పుడేమయింది పావనీ... మరి కాసేపటికా మూర్తి నడుం నొప్పి తగ్గి చక్కా లేచి నించుంటాడు. కావాలంటే చూడు."

"అసలు అందరికీ ఈ ఉచిత వైద్య సలహాలు ఎవరిమ్మన్నారు మిమ్మల్ని?! ఆ మూర్తిగారికి ఏమైనా అయితే మీరిచ్చిన మాత్ర వల్లనే ఇలా అయిందని పోలీస్ కేసు పెడితే ఏం చేస్తారు మీరు?" కోపంతో పాటు పావని స్వరం కూడా తీవ్రమయింది.

"పోలీసు కేసా... పాడా? ఆ మాత్రలు ఎవరికైనా మందులషాపు వాడు అమ్ముతాడు. అవేమైనా నిద్రమాత్రలా ఏంటి?! పైగా నిజంగానే నడుం నొప్పికి నాకిదివరకు పనిచేసిన మాత్రలే అవి." ఎదురుదాడికి ప్రయత్నించాడు పరోపకార్.

"చక్కగా ఉద్యోగం చేసుకోక మీకెందుకీ ప్రజాసేవ చెప్పండి? పైగా ప్రమాద కరం కూడా!" అదేస్థాయిలో అతని దాడినెదుర్కొంది పావని.

"నేనేమీ అల్లాటప్పాగా మందులు చెప్పడంలేదు. అవసరమైతే ఆ మెడికల్ షాప్ అప్పారావును అడిగే చెప్తున్నాను. పైగా ఈమధ్య మెడికల్ గైడ్ కూడా కొన్నాను కదా! అందులో అన్నిరకాల మందులు ఎందుకు పనిచేస్తాయో కూడా వివరాలు ఉన్నాయి. నీకేం భయం లేదులే!" భార్యకు అభయమిస్తూ చెప్పాడు పరోపకార్.

"మీరేం డాక్టర్ చదువు వెలగబెట్టలేదు కదా! మనకెందుకొచ్చిన గొడవ చెప్పండి?!" మళ్ళీ నచ్చచెప్పే ప్రయత్నం చేసింది పావని.

"ఏమీ కాదులే పావనీ. ఏదో నాకు వీలైనంత వరకూ ఇదో ప్రజాసేవ."


"ప్రజాసేవా?! ప్రాణాల తీతా?! మన ప్రాణాల మీదకీ తెచ్చేటట్టుగా ఉన్నారె ప్పుడో మీరు!"

"నువ్వంత భయపడకులే కానీ తలనొప్పిగా ఉంది కొంచెం టీ ఇద్దూ?!" మాట మార్చేశాడు పరోపకార్.

"ఎలాగోలా నా నోరు మూయించేస్తారు!" విసురుగా లోపలికెళ్ళింది పావని.

✦✦✦




"ఏడమ్మా మీ ఆయన?!... ఆఫీసుకెళ్ళి పోయాడా?!" అరుస్తూ వచ్చింది పక్కింటి జానకమ్మ పిన్నిగారు.

"ఏమయింది పిన్నిగారూ?!" ఆమెకు ఎదురెళ్ళి అడిగింది పావని.

"ఏం కావాలి? పసిపిల్లాడని కూడా చూడకుండా ఏదో ఒకటి చెప్పెయ్యడమేనా? మీ ఆయనకసలు జాగ్రత్త లేదమ్మాయ్!" గద్దించింది జానకమ్మ.

"ఎవరికైనా ప్రమాదమా?!" భయంతో గుటకలు మింగింది పావని.

"మా మనవడు నానిగాడికమ్మాయ్! ఇప్పుడే ఆసుపత్రినుండి వస్తున్నాం. డాక్టర్ గారు మా అందర్నీ ఎడాపెడా తిట్టిపోసారు. మా అదృష్టం బావుండబట్టి పిల్లాడికి ఏమీ కాలేదు."

"అసలేమయింది పిన్నిగారూ?!..." భర్త ఏం

కొంప ముంచాడో అని పావనికి ఇంకా ఆదుర్దా తగ్గలేదు.

"ఉదయం నానిగాడు మీ ఇంటికొచ్చి, మీ ఆయన ఎవరికో ఏవో మందులు వాడమని సలహా ఇస్తుండటం చూసి తనకు తలనొప్పిగా ఉందని చెప్పాడట. మీ ఆయనేమో అమృతాం జనం వాడమని చెప్పి ఆఫీసుకు వెళ్ళిపోయా డట. వీడేమో దాన్ని వేలితో తీసుకుని సీసాడు మందూ నాకేసాడట! ఆ తర్వాత ఇంటికొచ్చి 'కారం కారం' అని గోల!... అంతలోనే రెండు మూడు వాంతులు!!... చాలా గాభరా పడి పోయాం. వెంటనే డాక్టర్ దగ్గరకు తీసుకెళ్ళాం కాబట్టి సరిపోయింది."


"అయ్యో పిన్నిగారూ... పాపం నానిగాడు! చాలా ఇబ్బంది అయిపోయింది మీ అందరికీ!" నొచ్చుకుంటూ చెప్పింది పావని.

"ఇబ్బంది అన్నది చిన్న పదం. నానిగాడి కడుపులో ఉన్న అమృతాంజనాన్నంతా బైటకు కక్కించేసరికి తలప్రాణం తోకలోకొచ్చింది అంత పెద్ద డాక్టరుగారిక్కూడా!... మీ ఆయనకు ఇలా అందరికీ ఉచితసలహాలివ్వమని ఎవరు చెప్పారమ్మా?!" రుసరుసలాడింది జానకమ్మ.

"నేను చెబుతూనే ఉన్నా పిన్నిగారూ!... అయినా ఆయన వినడంలేదు."

"నీలాగా సౌమ్యంగా చెబితే వినడు కానీ సాయంత్రం నేనొచ్చి ఇస్తానుండు సరైన డోసు!" కోపంగా చెప్పి వెళ్ళిపోయింది జానకమ్మ.

✦✦✦




"డాడీ... నీ మెడికల్ అడ్వైజ్‌లు ఇవ్వడం మానవా?!" పదిహేనేళ్ళ కొడుకు ప్రజ్వల్ కోపంగా అడిగాడు పరోపకార్‌ని.

"ఇప్పుడేమైందిరా?" కొడుకును అడిగింది పావని.

పరోపకార్ మాత్రం తాపీగా పేపర్ చదువుతూ కూర్చున్నాడు.

"ఏం కావాలి? నిన్న మా స్కూలుకి ఫీజ్ కట్టడానికొచ్చారు కదా?"

"అవును."

"అక్కడ ఫీజ్ కట్టించుకునే ఆవిడకి ఏదో మందు పేరు చెప్పారట. ఇవాళ ఆవిడకి సీరియస్ అయి హాస్పిటల్లో ఉంది."

"ఏం మందు చెప్పారండీ?" గాభరాగా భర్తను అడిగింది పావని.

"నేను వెళ్ళేటప్పటికి బల్ల మీద తలవాల్చి పడుకుని ఉందావిడ. ఏంటని అడిగితే కళ్ళు తిరుగుతున్నాయని చెప్పింది. బీపీతగ్గడానికి ఏ టాబ్లెట్ వేసుకోవాలో చెప్పానంతే!"

"అసలు ఆవిడకు బీపీనో... కాదో... మీకు తెలీదు కదా డాడీ?! ఎందుకు మీకు తోచిన టాబ్లెట్ చెప్పెయ్యడమేనా? ఏమైనా అయితే?!" ప్రజ్వల్ ఆవేశంగా అడిగాడు.


"బీపీ మాత్రకే ఏమీ అయిపోదురా ప్రజ్వల్! ఆవిడకు ఇంకేదో ప్రోబ్లెం ఉండి ఉంటుంది." నిదానంగా చెప్పాడు పరోపకార్.

"మీకన్నీ తెలిసినట్టే డాక్టర్లా బిల్డప్ ఇచ్చి మరీ చెప్పేస్తారు డాడీ! ఇవాళ నన్ను తన రూంకి పిలిచి ప్రిన్సిపాల్ గట్టిగా చీవాట్లు వేసేశారు డాడీ! ఆవిడ భర్త స్కూల్‌కి వచ్చి ప్రిన్సిపాల్‌ని కడిగేశాడట! ఆ కోపం అంతా నా పైన చూపించి మరీ తిట్టారు. ఆవిడకు చాలా సీరియస్ అయిపోయిందట!" కోపాన్ని అదుపులో పెట్టుకునేందుకు విఫలయత్నం చేస్తూ చెప్పాడు ప్రజ్వల్.

"అంత సీరియస్ ఎందుకయిందబ్బా!" తల గోక్కున్నాడు పరోపకార్.

"ఆవిడ ప్రెగ్నెంట్ అట డాడీ!" కోపంగా చెప్పి తన రూం వైపు వెళ్ళిపోయాడు ప్రజ్వల్.

"గమనించలేదు పావనీ!... నేను మాట్లాడేట



ప్పుడు ఆవిడ కూర్చుని ఉంది కదా...టెబుల్ అడ్డంగా ఉన్నట్టుంది!" అన్నాడు పరోపకార్.

గుడ్లురుముతూ భర్తను చూసింది పావని!!

✦✦✦

"పావనీ!" ఆఫీసునుండి వస్తూనే బిగ్గరగా కేక పెట్టాడు పరోపకార్.

"ఏమయిందండీ?!" లోపలినుండి పరుగు లాంటి నడకతో వచ్చింది పావని.

మళ్ళీ చుట్టుపక్కల ఎవరికేమయ్యిందో అని ఆమె భయం ఆమెది మరి!

"ఇవిగో స్వీట్స్!" ఆనందంగా అందిస్తూ చెప్పాడు పరోపకార్.

"ఏంటో విశేషం?" భయం నుండి తేరుకుని అడిగింది పావని.

"ఎంతో కాలంగా వేధిస్తున్న మా బాస్ తన మెడ నొప్పి నేను వాడమన్న మాత్రతో చిటికెలో ఎగిరిపోయిందట!"

"నిజమే?!" నమ్మలేనట్టు అంది పావని.

"అవును! అక్షరాలా నిజం పావనీ!... సాయంత్రం స్టాఫ్ అందరినీ పిలిచి మీటింగ్ పెట్టి కూర్చోబెట్టి మరీ నాకు థ్యాంక్స్ చెప్పాడు బాస్!" ఉత్సాహంగా చెప్పాడు పరోపకార్.

"అసలు పూర్తిగా తగ్గిందో లేదో చూసుకున్నాడో లేడో ఆయన?" ఇంకా సందేహంగానే చెప్పింది పావని.

"నాకు ఆయన ప్రోబ్లెం చెప్పడం... నేను ఆయనకు సలహా చెప్పడం చిటికెలో జరిగి





పోయాయ్!" ఉక్రోషంగా చెప్పాడు పరోపకార్.

"అయితే మీ చేతి మాత్ర బాగానే పని చేసిందన్నమాట!" నమ్మడానికి బలవంతంగా ప్రయత్నిస్తున్నట్టుగా ఉందామె స్వరం.

"చేతి మాత్ర కాదు. నోటి మాత్ర... అదే నోటితో చెప్పిన మాత్ర!" భార్య మాటలను సరి చేశాడు పరోపకార్.

"అయినా నాకో డౌటండీ." పెనుభూతం లాంటి తన అనుమానాన్ని అడిగేందుకు ఉద్యుక్తురాలైంది పావని.

"నీకెప్పుడూ నా ప్రజాసేవ మీద డౌటేగా! ఏంటది?" చిరాగ్గా అన్నాడు పరోపకార్.




"ఈసారి మీ సలహా అంత చక్కగా ఎలా పనిచేసింది? సాధారణంగా మన మీదకు దండయాత్రలు జరిపేవాళ్ళే కదా, మీ సలహాల నందుకున్న వాళ్ళందరూ?! ఈసారి సీన్ ఇలా రివర్స్ అయిందేంటీ?!" కొంచెం భయపడుతూనే సందేహం వెలిబుచ్చింది పావని.

"సీన్ రివర్స్ అవడం అన్న ప్రయోగం నెగటివ్ వాటికి వాడాలే! ఇలా శుభం జరిగినప్పుడు కాదు." తన ఉత్సాహంపై నీళ్ళు చల్లేందుకు దీక్షగా ప్రయత్నిస్తున్న భార్యపై కోపం తెచ్చుకున్నాడు పరోపకార్!

"సరే...సరే... కంగ్రాట్సండీ! ఇంతకూ మీ విజయం వెనుక ఉన్నది ఎవరో తెలుసుకో వచ్చా?!" చాటంత ముఖం చేసుకుని అడిగింది పావని.

"అడుగడుగునా నన్ను వెనక్కి లాగే నువ్వు మాత్రం కాదులే!" కసిగా చెప్పాడు పరోపకార్.

"మరి?!"

"ఇదిగో... ఇది! సరికొత్త మెడికల్ గైడ్!" విజయగర్వంతో కన్నులెగరేస్తూ చెప్పాడు పరోపకార్.

"ఉండండి టీ తెచ్చిస్తాను." అంటూ మూతి మూడు వంకర్లు తిప్పుతూ ముందుకు అడుగేసింది పావని.

✦✦✦

"పావనీ... పావనీ!" అర్థరాత్రి వేళ పావనిని గట్టిగా తట్టి లేపాడు పరోపకార్!

ఉలిక్కిపడి కళ్ళు తెరిచింది పావని.

కడుపును చేత్తో పట్టుకుని మెలికలు తిరిగి పోతున్నాడు పరోపకార్.

“ఏమయిందండీ?!” కంగారుగా అడిగింది పావని.

“ఏమో తెలియడంలేదు. గంటనుండి ఒకటే మోషన్స్... ఇప్పటికి ఆరయ్యాయి.” మళ్ళీ కడుపును చేత్తో పట్టుకుని చెప్పాడు పరోపకార్.

“ఉండండి! ప్రజ్వల్‌ని లేపుతాను.” గబగబా పరుగు తీసింది.

అరగంటలో వాళ్ళు ముగ్గురూ హాస్పిటల్‌కి చేరుకున్నారు. తెల్లవారే దాకా ఐసీయూలోనే ఉంచారు పరోపకార్ని.

ఆరుగంటలకు డాక్టర్ ఐసీయూలోంచి బైట కొచ్చి చెప్పాడు.

“ప్రాణాపాయం తప్పింది.” అతని ముఖం చాలా గంభీరంగా ఉంది.

సంతోషంగా ఒకరి ముఖాలు ఒకరు చూసుకుని నిట్టూర్చారు పావని, ప్రజ్వల్.

“రాత్రి ఏమయింది?!” ప్రశ్నించాడు డాక్టర్.

“కడుపులో నొప్పిగా ఉందన్నారండీ!”


“డాక్టర్ దగ్గరికి వెళ్ళలేదా?”

“ఆయనకు అలాంటి అలవాటు లేదండీ!”

“మరి?” డాక్టర్ ముఖంలో ఆగ్రహం.

“ఆయనే ఏదో మాత్ర వేసేసుకుంటారు.”

“అతను డాక్టర్ కాదుగా?” డాక్టర్ భృకుటి ముడిపడింది.




“కాదు! కానీ చాలా మందులు నాకు తెలుసంటారండీ!” పావని చెప్పింది.

“ఎలా తెలుసు?!”

“మా చుట్టుపక్కల అందరికీ ఆయనే మందులిస్తూ ఉంటారు.”

“అతని అన్నదమ్ములెవరైనా డాక్టరా?”

“కాదండీ. ఎప్పటినుండో ఆయన స్టడీ చేసి మందులిస్తున్నారు.”

“ఏం స్టడీ చేస్తున్నాడు?” డాక్టర్లో అసహనం పెరిగిపోతోంది.

“మెడికల్ గైడండీ! దాని ఆధారంగానే అందరికీ వైద్యసలహాలు ఇస్తారు.”

“అందుకే అసలేం మందు మింగాడో తెలిసి చావక రాత్రినుండీ నాకు చచ్చే చావయ్యింది. మీ ఆయన సొంత వైద్యం ఎంత త్వరగా ఆపితే అంతమంచిది అందరికీ!” కోపంగా అన్నాడు డాక్టర్.

“అయ్యో!... మరెలా కాపాడారు సార్?” ప్రశ్నించింది పావని.

“విపరీతంగా మోషన్స్ అయిపోవడంతో అతనికి నీరసంతో స్పృహ తప్పిపోయాడు. మూడు సెలైన్ బాటిల్స్ ఎక్కాక కానీ తెలివి రాలేదు. వచ్చాక ఏం వేసుకున్నాడో అతన్నే అడిగాం. అది తెలిసాక కానీ మాకెలా వైద్యం చెయ్యాలో అర్థం కాలేదు.” డాక్టర్ కంఠం కోపాన్నింకా కక్కుతూనే ఉంది.

“ఏం వేసుకున్నారు డాక్టర్?”

“మోషన్ తగ్గడానికి బదులుగా అవ్వడానికి మాత్ర!”


“అయ్యయ్యో! ఎలాగైనా ఈయన అలవాటు మానిపించాలి డాక్టర్! ప్రజాసేవంటూ ఇలా అందరికీ వైద్యసలహాలు చెప్పి కొంపలు ముంచేస్తున్నారు.” కళ్ళొత్తుకుంది పావని.

“ఎక్కడమ్మా మీ ఆయన?!” తలెత్తి చూసేసరికి కోపంగా చూస్తూ పరోపకార్ బాస్ కనిపించాడు ఒకవైపుకి వంకరపోయిన మెడతో!

‘ఓమైగాడ్’ అనుకుంటూ...


“డా...క్...ట...ర్...!” అని గావుకేక పెట్టింది పావని.




చిత్రహాసం
గాంధీ
చూద్దామని నిన్న మీ సినిమాకు వెళ్ళానా్నర్- థియేటర్లో ఎవ్వరూ లేరు- నేను ఒక్కడ్నే చూడాలంటే భయమేసి వెనక్కి వచ్చేశా!
సినిమా ఆఫీస్
హర్రర్
గాంధీ
వాడి మాటలు నమ్మకండి - వాడికి నేనివ్వాల్సిన లక్ష రూపాయలు ఎగ్గొట్టాను - అందుకే నా సినిమా బాగా లేదని ప్రచారం చేస్తున్నాడు!
BUS STOP
ఫిల్మ్ డైరెక్టర్
గాంధీ
స్టార్ హీరోలతో సినిమాలు తీసి అట్టర్ ఫ్లాఫ్ చేసిన డైరెక్టర్లే కాలరెగరేసుకుని తిరుగుతుంటే.. కొత్త వాళ్ళతో-అదీ లో బడ్జెట్‌లో తీసిన నీ సినిమా పోయినందుకు ఎందుకు బాధ పడతావ్!
గాంధీ
ఫిల్మ్ డైరెక్టర్
నాకు సినిమాల్లో వేషం ఇచ్చి తర్వాత ఆ సీన్లు ఎడిటింగ్ లో తీసేసిన సినిమాలన్నీ అట్టర్ ఫ్లాఫ్ అయ్యాయి - అది కాస్త గుర్తుపెట్టుకోండి!
ఫిల్మ్ డైరెక్టర్
సినిమా ఆఫీస్
గాంధీ

వేదనాగ ఫౌండేషన్ ఉగాది హాస్యకథల పోటీలో
ప్రత్యేక బహుమతి పొందిన కథ

# వేట




ఎన్. అరుణశ్రీ, 8019529804




"కాశ్మీరులోయలో... కన్యకుమారిలో ఓ చందమామ" పాట... దుప్పటి తన్ని గుర్రుపెట్టి నిద్రపోతున్న గుర్నాధాన్ని లేపేసింది.

"ఒసేయ్ కాంతం! ఇంత పొద్దున్నే ఎఫ్ ఎం రేడియో పెట్టావేంటే?" కేకేసాడు భార్యని.

"ఆదివారం కదా! తమరికి పొద్దున్నేలానే ఉంటుంది... ఇప్పుడు టైం పదయింది! కాస్త పక్క దిగి దంతధావనం కానిస్తే కాఫీ ఇస్తాను." అంది కాంతం.

గుర్నాధానికి పెళ్ళయ్యి నాలుగేళ్లయింది ఇంత వరకు సంతానానికి నోచుకోలేదు. కాంతం ఎక్కని గుడి మెట్లు లేవు చెయ్యని నోము లేదు. చిన్నప్పుడు తల్లి తండ్రులు గుర్నాధం జాతకం చూపిస్తే "గుర్నాధం అదృష్టహీనుడని, నష్ట జాతకుడని ఈ జన్మ కింతే" అని జ్యోతిష్య బ్రహ్మ ప్రారబ్ధ శర్మ ఎప్పుడో తేల్చి చెప్పేసాడు.

అదేమీ కర్మమో ఆయన చెప్పినట్టు గుర్నాధం ఏటికేడు పెరుగుతుంటే అతని తల్లి తండ్రుల ఆస్తి కర్పూరంలా తరిగిపోయింది. ఆ దిగులుతోనే ఆయన పోయాడు. తల్లి శాంతమ్మ ఎలాగోలాగా సంసారాన్ని నెట్టుకొచ్చి ఒక్కగానొక్క కొడుకు గుర్నాధాన్ని చదివించింది. చాలా ప్రయత్నాల తర్వాత గుర్నాధం ఎలాగో ఒక ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం తెచ్చుకున్నాడు. జాతక దోషం వల్ల ఎప్పటికీ పెళ్లవ్వకపోతే ఎదురు కట్నం ఇచ్చి కాంతమ్మని కోడలిగా తెచ్చుకుంది శాంతమ్మ.

ఆర్నెల్లు సావాసంచేస్తే వీరు వారవుతారు అన్న సామెత నిజం చేస్తూ గుర్నాధం నష్ట జాతకం కాంతానికి కూడా అంటుకుంది.

గుర్నాధం కాంతాల దురదృష్టాలు ఎలా ఉంటాయో మచ్చుకు ఒకటి.

ఆ మధ్య గుర్నాధం మావయ్య కొడుకు పెళ్ళి కార్డు వచ్చిం దగ్గరనుండీ పెళ్ళి పెద్ద ఫైవ్‌స్టార్ హోటల్లో గ్రాండ్‌గా చేస్తు న్నారని తెలిసి రక రకాల ఐటమ్స్ పెళ్ళిలో పెడతారు కదా అన్నీ ఎంచక్కా ఒక పట్టు పట్టచ్చు అని గంపెడాశతో మొగుడు పెళ్ళాలు వారం ముందేనుంచే ప్లాన్ చేసుకున్నారు.

తీరా పెళ్ళి రోజు కావలసిన ఐటమ్స్ తిందామని గుర్నాధం ప్లేటు తీసుకొన్నాడో లేదో కడుపులో మంట మొదలయ్యింది. చికెన్ బిరియాని తిందామనుకుంటే కడుపులో వికారం మొదల య్యింది. ఏమీ తినలేక భార్య తనకి నచ్చిన ఐటమ్స్ అన్నీ తెచ్చుకొని కూర్చుని తింటూ ఉంటే ఆబగా చూస్తూ తన దురదృష్టాన్ని నిందించుకున్నాడు.

అన్నీ తిన్న తర్వాత ఇంటి కొచ్చిన కాంతం కక్కడం మొదలు పెట్టింది. శాంతమ్మ ఇదేదో నెల తప్పిన వ్యవహారం అనుకుని కోడలిని హాస్పిటలుకు తీసుకుపోతే మూడువందలు ఫీజు గుంజి తిన్నదేదో పడలేదని చెప్పింది డాక్టర్.

ఇలా ఎన్నో అనుభవాలు...




ఐతే కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు కదా! గుర్నాధానికి మంచి రోజులు వస్తాయేమో. ఒకనాడు బిగబజార్ కెళ్తే చిన్నప్పుడెప్పుడో జాతకం చెప్పిన శర్మ గారు కనిపించారు. చిన్నప్పుడే నష్టజాతకుడని ముద్ర వేసాడని ఆయనంటే కోపం గుర్నాధానికి. ఎదురుపడ్డాక తప్పదని–


"ఏం శర్మగారు బాగున్నారా?" అడిగాడు గుర్నాధం.

"ఆ బాగున్నా గుర్నాధం ! నువ్వెలా వున్నావు?" అప్యాయంగా పలకరించాడు ప్రారబ్ధశర్మ.

"ఎలా బాగుంటానండి మీరే చెప్పారుగా నా జాతకం ఈ జన్మకింతేనని?" నిష్ఠూరమాడాడు.

"అలా అనకయ్యా గుర్నాధం! నీకూ మంచి రోజులొస్తాయి. ఈమధ్య నీలాంటి ఒక నష్ట జాతకుడికి అదృష్టం కలిసొచ్చేట్టు చేశాను." అన్నారు శర్మగారు.

"నిజమా! ఏం పూజలు చేయించారు గురువుగారు?" ఆశగా అడిగాడు గుర్నాధం.




"పూజలు వ్రతాలూ కాదు కానీ అదృష్టాన్ని వెతుక్కోమని వేటకి పంపించాను. అదృష్టం దొరకడంతో ఇప్పుడు ఏ కష్ట నష్టాలు లేకుండా పిల్ల పాపలతో సంతోషంగా వున్నాడు." శర్మ గారన్నారు కించిత్ గర్వంగా.

"ఆ!...వేటా?..." ఆశ్చర్యంగా అడిగాడు గుర్నాధం.

"ఆ వేటే! వేటకెళ్ళేముందర నీ చేత నవగ్రహ పూజ చేయించాలి. ముఖ్యంగా ఆ శనీశ్వరుని అనుగ్రహంనీకు కలగాలి.ఎల్లుండే శని త్రయో దశి... ఆ రోజు ఉదయమే మా ఇంటికొచ్చే య్యండి నువ్వు నీ భార్య!" చెప్పారు శర్మ గారు.

ఈ సారి తాడో పేడో తేల్చుకోవాలిఅదృష్టం కోసం ఏ సాహస కార్యమైనా చెయ్యడానికి ఆఖరికి పులిని వేటాడడానికైనా సిద్ధమయ్యి పోవాలి అనుకొన్నాడు గుర్నాధం. తప్పకుండా వస్తాము గురువుగారు అని చెప్పి సెలవు తీసు కున్నాడు గుర్నాధం.

"అదృష్ట ప్రాప్తిరస్తూ"అని దీవించారు శర్మ గారు.

శనివారం నాడు భార్యాభర్తలిద్దరూ స్నానా దులు ముగించుకుని పట్టు వస్త్రాలు ధరించి, శర్మ గారింటికి వెళ్ళారు.

శర్మగారు భార్య భర్త లిద్దరిచేత నవగ్రహ

పూజ చేయించి శనికి ప్రత్యేకంగా తైలాభిషేకం చేయించారు. గుర్నాధాన్ని కొంచెం దగ్గరగా పిలిచి చెవిలో ఏదో ఒక రహస్యం చెప్పి పంపించారు.

ఆ తర్వాత భార్యాభర్తలకు– "ఇది బ్రహ్మ రహస్యం... నువ్వు ఈ పనిపూర్తయ్యే వరకూ నేను చెప్పిన రహస్యం ఎవరికీ చెప్పకూడదు చివరకి నీ భార్యకు కూడా... అలా కాకుండా ఎవళ్ళకైనా చెప్తే నిన్ను దురదృష్ట దేవత ఆవహిస్తుంది. ఇక జన్మలో నీకు అదృష్టయోగం ఉండదు. జాగ్రత్త!" అని చెప్పారు.


"నల్లమల అడవిలో వేటాడడానికి మంచి ముహూర్తం నిర్ణయించాను... ఇక నువ్వు ఏ మాత్రం ఆలశ్యం చేయకుండా ఆ ముహూర్తంలో వేటకు బయలుదేరు" అని మంత్రించిన తాయత్తు ఒకటి అతని కుడి భుజానికి కట్టేడు.

"నల్లమల అడవుల్లో నీకు కావలసింది దొరుకుతుంది. అక్కడ నీకుసాయం చేయడానికి నాకు తెలిసిన చెంచురాంబాబు అని ఒక వేటగాడు ఉన్నాడు. అతనిని కలుసుకో" అని చెప్పి రాంబాబు ఫోన్‌నెంబర్ ఇచ్చారు శర్మగారు.

గురువుగారికి దక్షిణ సమర్పించుకుని భార్య భర్తలిద్దరూ సెలవు తీసుకున్నారు.

"ఏం చెప్పారండి గురువుగారు చెవిలో?" అడిగింది బండిమీద తీసుకెళ్తున్న గురునాథాన్ని భుజంమీద చెయ్యేస్తూ.

"అంతా విన్నావుకదా?...ఇది రహస్యం ఎలా చెప్పమంటావు?" కోప్పడ్డాడు గుర్నాధం.




"సరేలెండి!" మూతిముడిచింది కాంతం.

ఇంటికివెళ్ళగానే చెంచు రాంబాబుకు ఫోన్ చేసి గురువుగారు నెంబరు ఇచ్చారని అడవికెళ్లడానికి ముహూర్తం పెట్టారని చెప్పి, సమయం చెప్పాడు.

చెంచురాంబాబు శర్మగారు చెప్పారనగానే, చాలా బాగా మాట్లాడి– అడ్వాన్స్‌గా ముందర పదివేలు తన అకౌంట్‌లో వెయ్యమని, తన అకౌంట్ నెంబరు పంపించాడు.

అడవుల్లో వేట నిషిద్ధము కదా! పోలీస్‌లు పట్టుకుంటే ఎలా అని తన సందేహాన్ని వెలిబుచ్చాడు గుర్నాధం.

"నేనున్నాగా అంతా నేను చూసుకుంటా..." అంటూ భరోసా ఇచ్చాడు చెంచురాంబాబు.

గురువుగారు చెప్పిన ముహూర్తం నాటికి కర్నూల్ బయలు దేరాడు.

కర్నూలులో రాంబాబు జీపులో వచ్చి గుర్నాధాన్ని రిసీవ్ చేసుకున్నాడు.


చెంచు రాంబాబు అంటే ఏదో కోయదొరలా నెత్తి మీద కోడి ఈకలు తలకి గుడ్డ నడుముకి జంతు చర్మము ఉంటుందేమోనని ఊహించాడు గుర్నాధం. కానీ చెంచు రాంబాబు జీన్ ప్యాంటు టీ షర్ట్ వేసుకుని స్టైల్‌గా మెడలో ఒక బైనాక్యులర్స్ పెట్టుకుని వచ్చాడు. తనతో రెండు బ్యాగ్లు వేసుకుని మరీ వచ్చాడు.

పలకరింపులు అయినాక నల్లమల అడవుల వైపు జీపును స్పీడ్‌గా పరుగు పెట్టించాడు రాంబాబు. మాటల మధ్యలో రాంబాబు మంచి ఇంగ్లీష్ కూడా మాట్లాడటం చూసాక గుర్నాధానికి అర్థమయ్యింది గురువుగారు సరైన మనిషిని తనకి అప్పగించారని అందుకు ఆయనకు మనసులోనే కృతజ్ఞత చెప్పుకున్నాడు.

జీప్ పరుగులు పెడుతోంది. ఏదో కొత్త అనుభవం మరియు అనుభూతి. అనుకున్నది జరిగితే దెబ్బకి అదృష్టం దొరికితే నా కష్టాలన్నీ గట్టెక్కి పోతాయి అనుకున్నాడు. నేనే రాజు నేనే మంత్రి. నే ఆడిందే ఆట పాడిందే పాట అని ఏదేదో ఊహించుకుంటున్నాడు.

రాత్రి సరిగ్గా ఎనిమిది అవ్వొస్తోంది.

ఊరు దాటి అడవుల వైపు ప్రయాణిస్తోంది



వేగంగా జీప్.

దారిలో ఒక ధాబాలో రోటీలు తిని కొంత సేపు అక్కడున్న నులక మంచం పై నడుము వాల్చారు.

దారిలో జోగులాంబ టెంపుల్ దగ్గర ఆగి అమ్మవారి దర్శనం చేసుకుని రిజర్వు ఫారెస్ట్ లోకి అడుగు పెట్టారు.

దగ్గరలోనే జీప్ పార్క్ చేసి ఒక చెట్టు కింద టెంట్ వేసుకున్నారు. అందులో కూర్చొని తనతో తెచ్చిన ఒక బ్యాగ్ తీసాడు రాంబాబు.

అందులో ఏవో రెండు బాక్సులు ఉన్నాయి.

దాంతో పాటు కొన్ని కత్తులు, ఒక డబ్బాలో పీతలు, కొన్ని చేపలు ఉన్నాయి.

ఇంకో బ్యాగులో ఒక వల, ఇంకా చాలా సరంజామా ఉన్నాయి.


వింతగా చూస్తున్న గుర్నాధంతో– "మనం ఈ చేపలు, పీతలు ఎరగా వేస్తే సులభంగా వచ్చి చిక్కుతాయి మనకి కావలసినవి... అన్నట్టు మిగతా నలభైవేలు తెచ్చేవా?" అని అడిగాడు రాంబాబు.

"ఆ తెచ్చాను! పనయ్యిపోనీ ఇస్తాను!" అన్నాడు గుర్నాధం.

"అదేం కుదరదు! ముందరే ఇచ్చెయ్యాలి."

"సరే తీసుకో!" అని గుర్నాధం తన సూట్ కేసులో డబ్బు తీసి ఇచ్చాడు.

అలా డబ్బులు ఇస్తుండగా ఫారెస్ట్ ఆఫీసర్ రవీందర్ తన సిబ్బందితో ఏదో పనిమీద అటు వైపు వస్తూ వీళ్ళ ఇద్దరినీ చూసాడు.





టెంటు, కత్తులు ఆ సరంజామా అంతా చూసేసరికి– "ఏంటీ మావోయిస్టులా?... లేక పోతే ఎర్రచందనం స్మగ్లర్లా?...ఎవర్రా మీరు?" అని ఇద్దరినీ గదమాయించాడు.

గుర్నాధానికి భయమేసి నోటమాట రావడం లేదు. అన్ని కబుర్లు చెప్పిన రాంబాబు కూడా అలాగే భయంతో వణికి పోతున్నాడు.

ఇంకో పోలీసు– "సార్! వీళ్ళు అడవిలో వేటకు వచ్చినట్టున్నారు! ఇక్కడ వల ఉంది అన్నాడు.

"జంతువులను వేటాడటం నేరం అని తెలి యదా? ఏం వేటాడదామని వచ్చార్రా మీరు?" అడిగాడు ఫారెస్ట్ ఆఫీసర్ కోపంగా.




"అది రహస్యం సార్!... బయటకు చెప్ప కూడదు. కావాలంటే చెవిలో చెప్తా!" అన్నాడు.

"ఏంటీ వేషాలేస్తున్నావా?"

"లేదు సార్! ఒట్టు" అన్నాడు.

"సరే చెప్పు!" అన్నాడు.

గుర్నాధం చెప్పింది విని బుర్ర పనిచేయ లేదు. కొంతసేపు ఫారెస్ట్ ఆఫీసర్‌కి. తర్వాత నవ్వాగలేదు.

"ఏంటయ్యా!... నక్కను పట్టుకుని తోక తొక్కితే అదృష్టం వస్తుందా?... ఎవడు చెప్పా డయ్యా?..." అంటూ పగలబడి నవ్వుతూ గుర్నాధం భుజం పట్టుకుని ఊపాడు.

ఆ ఊపడంతో దబ్బున కింద పడ్డాడు గుర్నాధం. ఆ పడ్డం పడ్డం ఎక్కడ నుంచి వచ్చిందో తెలియదు ఒక నక్క చేపలు, పీతలు తినడానికి వచ్చింది... దాని మీద పడ్డాడు. కాకపోతే నక్కని చూసి భయపడ్డ గుర్నాధం లేచి పక్కకు పరుగెత్తబోయి దాని తోక తొక్కే సాడు. అది కుయ్యో అని కూతకూసి పారి పోయింది.

ఆఫీసర్ గుర్నాధం అమాయకత్వానికి జాలి పడి వదిలేసాడు.

తర్వాత నక్కతోక తొక్కడం వల్ల అదృష్టం వచ్చిందో లేక తాను కష్టపడటం వల్లో తెలి యదు కానీ... జీవితంలో అన్ని కలిసి వచ్చి హ్యాపీగా కాంతంతో జీవితాన్ని గడుపుతు న్నాడు గుర్నాధం.



కార్టూనిస్ట్ **రామ్‌శేషు**
**ఫన్** ప్రశ్నలకు-
సుదర్శనమ్ **పంచ్** సమాధానాలు


# ఫన్ పంచ్






✦ హుండీలో వేసిన డబ్బు దేవుడు నిజంగా తీసుకుంటే...?

**అందరూ సంతకంలేని చెక్‌లే వేస్తారు... గుప్తదానంలా!**




✦ మిమ్మల్ని హీరోగా పెట్టి సినిమా తీద్దామను కుంటున్నాను.. నిర్మాతను తెచ్చుకోండి.

**మీకు సన్మానం చేద్దామనుకుంటున్నా... జనాన్ని తెచ్చుకోండి!**



✦ మొన్నొక ఫ్రెండ్ గుండులో ఉన్న సుఖం చెప్పాడు... నాకయితే జుట్టు పట్టుకుని తన్నే ఛాన్స్ తన భార్యకు ఇవ్వలేదనే ఆనందం కనపడింది... అంతేనంటారా?

**మొట్టికాయల 'అనుభవం' లేని అలాంటివాడి ఆనందం గురించి నేను మాటాడను!**




✦ పెట్రోల్ రేటు రూపాయి పెరుగుతుంది అంటే..ముందు రోజు క్యూలో ఉండి పెట్రోల్ పోయించుకుంటారు.. అదే ఓటు వెయ్యడానికి క్యూలో నిలబడడా నికి ఎందుకు ఆసక్తి చూపించరు?

**పచ్చనోటు తీసుకున్న ప్రతివాడూ 'నీతి'తో... 'నిజాయితీ'తో వేస్తున్నాడు ఓటు!... ఇంత గొప్ప 'ఆసక్తి' మీకు కనపట్లేదా?**



✦ అదే నిమిషానికి ఇంత అని ఛార్జ్ చేస్తే అవసరం అయిన వరకే మాట్లాడి పెట్టేస్తారు. ఫ్రీ కాల్స్‌తో అనవసరం అయినవి మాట్లాడి గొడవలు పడుతున్నారు. ఫ్రీ కాల్స్ ఎత్తేస్తే గొడవల్లేకుండా బతుకుతారేమో అనిపిస్తుంది. మీరేమంటారు?

**మీరోటి గుర్తించాలి... అనవసరమయినవి మాటాడితే గొడవలు రావు... అవసరమయినవి(!) మాటాడితేనే వస్తాయి... గొడవలు!**





✦ వాళ్లింట్లోనే వాళ్ళ వంటని తినని వారు.. ఈ మధ్య యూట్యూబ్ ఛానల్ పెట్టి వంటలు చేస్తు న్నారు... దీని మీద మీ అభిప్రాయం.

**తినమని కాదు... చూడమని వాళ్ళ ఉద్దేశం!!**

✦ నవ్విన నాప చేను పండడమంటే...?

**వెనకటికి... వేసక్టమీ చేయించుకున్నాడని నవ్వితే... వాళ్ళావిడకి కవలలు పుట్టడం...!**




✦ పెళ్లి వయసు 21 పెట్టి, ఓటు హక్కు 18 ఏళ్లకే ఇవ్వడంపై మీ అభిప్రాయం.

**నా అభిప్రాయం సరే... పరికిణీ ఫంక్షన్ నాడే 'ఫస్ట్‌నైట్' కూడా చేసేయాలి... అన్నది మీ అభిప్రాయమా?**




Owned & Published by : Ramu Panda from D.No.8-215/4, Yerrabalem, Guntur Dist.
Printed at: Rainbow Print Pack, Hyderabad. Edited by.Ramu.P

# కరోనా కార్టూన్స్



నీ వల్ల ఒక మంచి జరిగింది కరోనా ప్రపంచానికి 'నమస్కారం' అనే సంస్కారం నేర్పావు!
నమస్తే కరోనా!
వడ్డేపల్లి వెంకటేష్


దేశ క్షేమం కోసం తప్పదండీ...
వడ్డేపల్లి వెంకటేష్


రోడ్ల మీదికి వస్తే కరోనా రోగులకు సేవ చేసే అవకాశం ఇస్తాం అని ప్రకటించాం సార్.దెబ్బకు రోడ్లన్నీ ఖాళీ.....
వడ్డేపల్లి వెంకటేష్


చేతులు కడుక్కున్నావా బ్రదర్?
!?
వడ్డేపల్లి వెంకటేష్

Hasyanandam April 2020. RNI No. APTEL 08387/01/1/2003-TC



Save Water



With Jaquar Taps

Best Cartoon of the Month




**Sambamurthy Enterprises**
12-10-04, Convent Street,
Vijayawada-520 001.
fone: 0866-2563824, 9676444548